# లాయర్

సంపుటి : 41 సంచిక : 01 11.6.2021, శుక్రవారం వెల : రూ. 5 /-

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి


## కరోనా కష్టాల్లో కూడా
# జనంపై కరుణ చూపిన జగన్


*రెండేళ్ళలో 31 పథకాల ద్వారా మొత్తం 1,31,725.55 కోట్ల రూపాయలు ప్రజలు ప్రభుత్వం నుండి అందుకున్నారు. కరోనాలో సైతం సిఎం జగన్ ప్రజలపై కరుణ చూపించారు.*

*మరి 2024లో ఓటుకు నోటు లేకుండా ఇదే ప్రజలు తమ జగనన్నని కరుణిస్తారా?*

3 లో

## రాజకీయ వివాదంలో ఆనందయ్య ఔషధం

2 లో



# నిబద్ధతకు 40 ఏళ్ళు



**దృఢమైన లక్ష్యంతో, బలమైన ఆశయంతో, ఆదర్శవంతమైన ఆకాంక్షతో, మహోన్నత సంకల్పంతో, కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి గారు ఆరంభించిన అక్షర సమరానికి 40 ఏళ్ళు.**

**నిత్యం నూతన ప్రయోగాలతో, అత్యున్నత ప్రమాణాలతో స్థానిక పత్రికా ప్రపంచంలో సంచలనాలకు ఆవిష్కరణ జరిగి 40 ఏళ్ళు.**

**నిర్లక్ష్యం, నిర్లిప్తత, నిరంకుశత్వం, అవినీతి, అక్రమం, అధర్మంపై రాజగోపాలరెడ్డి గారు ప్రారంభించిన ప్రతిఘటనకు 40 ఏళ్ళు.**

**నీతి, నియమం, నిజాయతి, నిష్పక్షపాతం, నిస్వార్థంతో కూడిన నిబద్ధతకు 40 ఏళ్ళు.**

అవును, నెల్లూరుజిల్లాతో పాటు, భారతదేశ నలుచెరగులా వున్న నెల్లూరీయులతో సహా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న నెల్లూరీయులందరికీ వారం వారం నెల్లూరు వార్తలను మోసుకెళ్తున్న మన లాయర్ వారపత్రికకు 40 ఏళ్ళు. జూన్ 5, 2021న నలభైఏళ్ళు పూర్తి చేసుకుని 41వ వసంతంలో అడుగుపెట్టింది మన లాయర్. ఇది మన పండుగ, మనందరి సంబరం, మన ముంగిళ్ళే వేదికలుగా జరుగుతున్న వేడుక.

ఒక పత్రిక ఎంతటి పురాతనమైనది అన్నదానికన్నా, ఆ పత్రిక ఎంత ప్రయోజనకరమైందన్నది చాలా ముఖ్యం. సమాజ శ్రేయస్సే ధ్యేయంగా, ప్రజల నాడి తెలుసుకుని వారి వాణిని ఎంతటి సమర్థవంతంగా వినిపించగలుగుతోం దన్నదే ప్రధానం. ప్రభుత్వాలకి ప్రజలకు మధ్య వారధిగా, ప్రజా సమస్యలను ప్రతిబింబింపచేసే సారధిగా పోషిస్తున్న పాత్రే కీలకం. అక్షరాలా అవన్నీ ఆచరిస్తూ, నైతిక విలువలు పాటిస్తూ వ్యవస్థాపకుడి ఆలోచనలకు అక్షర సాక్ష్యంగా పాఠకుల మనస్సులలో సుస్థిర స్థానం సాధించుకుంది మన లాయర్.

"జర్నలిజం వ్యాపారం కాకూడదు, జర్నలిస్టులు క్యాపిటలిస్టులుగా మారకూడదు. ఆలా జరిగిన రోజున ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే నాలుగు స్తంబాలలో ఓ మూలస్థంభం కూలిపోయినట్టే ..!" అని స్వర్గీయ రాజగోపాలరెడ్డి గారు చెప్పిన మాటలను అనుక్షణం స్మరించుకుంటూ, జర్నలిజాన్ని వ్యాపారంలా కాకుండా వ్యాపకంగా మార్చుకుని ముందుకు సాగుతోంది మన లాయర్.


1981, జూన్ 5వ తేదీన పత్రిక ప్రారంభించిన నాటినుండీ తనకంటూ ఒక ప్రత్యేక ఒరవడిని సృష్టించుకుని, పాత్రికేయవిలువలకు కట్టుబడి, చందాదారులు, పాఠకులు, ప్రకటనకర్తలు, ఆప్తులు, ఆత్మీయుల ఆశీస్సులే పెట్టుబడిగా వెలువడుతోంది మన లాయర్. నిర్భయంగా, నిస్సంకోచంగా, ప్రజల పక్షాన వాదించే వార్తా కరదీపికగా, మంచిని ప్రోత్సహించే సమాచార వీచికగా, రాబోవు తరానికి గడచిన, గడుస్తున్న తరాల చరిత్రను తెలిపే సమగ్ర సూచికగా ప్రచురితమవుతోంది మన లాయర్.

గతంలో పలు సందర్భాలలో చెప్పినట్లుగా, కుప్పలుతెప్పలుగా వస్తున్న దినపత్రికలు, ప్రతీ క్షణం జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు అందిస్తున్న టి.వి చానళ్లు, పుట్టలోనుండి చీమలు వచ్చినట్లుగా వస్తున్న యూ ట్యూబ్ చానళ్ళు, నిరంతరం వార్తలతో, వ్యాఖ్యలతో సెల్‌ఫోన్‌లలో ప్రత్యక్షమవుతున్న సామాజిక మాధ్యామాల నడుమ నిరంతరాయంగా, ధీరోదాత్తంగా ఒక స్థానిక పత్రిక 40 సంవత్సరాలుగా విజయవంతంగా నడుస్తోందంటే, అది ఏ ఒక్కరి ఘనతో కాదు... ఆ విజయం మనందరి సొంతం.

తరాలు మారినా చెరగని ఆదరణతో, నలభై ఏళ్లుగా అదే ఆప్యాయతని, అనురాగాన్ని మాపై చూపిస్తున్న "ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు" తెలుపుకుంటూ, మీరు చూపించే ఆభిమానమే అండగా రెట్టింపు ఉత్సాహంతో, మరింత విశ్వాసంతో 'స్వర్ణోత్సవం' వైపు అడుగులు వేస్తున్నాం.

లాయర్ ఏ సత్కార్యం చేపట్టినా సుమనస్సుతో మేమున్నామంటూ భుజం తట్టి ప్రోత్సహించి ముందుకు నడిపిస్తున్న ప్రతిఒక్కరికీ పేరు పేరునా ఈ 40వ వార్షికోత్సవం సందర్భంగా కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలను తెలియజేసు కుంటున్నాం.

లాయర్‌కు ప్రాణప్రతిష్ట చేసిన కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి గారిని వినమ్రంగా స్మరించుకుంటూ, అక్షరసేద్యంలో మరో మైలురాయిని దాటి, మీ సేవ కోసం పునరంకితమవుతున్నాం ...!



సదా.. మీ సేవాభిలాషి

(తుంగా శివప్రభాత్‌రెడ్డి)

# రాజకీయ వివాదంలో ఆనందయ్య ఔషధం

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని గుట్టుచప్పుడు కాకుండా సేవాభావంతో కరోనా నివారణకు ఆయుర్వేద మందు అందిస్తుండిన ఆనందయ్య ఇప్పుడు రాజకీయ రొచ్చులో చిక్కుకున్నారు. దశాబ్దాల కాలంగా ఆయన వివిధ ఆరోగ్య సమస్యలకు తనకు తోచిన మందు ఉచితంగా ఇస్తూ ప్రజల మనసులకు దగ్గరయ్యారు. ఇప్పుడు ఆయన ఇస్తున్న మందు కరోనాకి దివ్య ఔషధంగా పనిచేస్తుందన్న నమ్మకం ప్రజలలో బలంగా వినిపించడంతో ఆయన పేరు ఆనోటా... ఈ నోటా పాకి దేశవ్యాప్తంగా మారుమోగిపోతున్న విషయం మనకు తెలిసిందే. అయితే ఆయన ఔషధానికి రాజకీయ వివాదం తోడై అది చిలికి చిలికి గాలివానగా మారి, నెల్లూరుజిల్లా రాజకీయ చరిత్రలో ఎప్పుడూ వినిపించనంతటి ఘోరమైన భాష నేతల నోటి వెంట వచ్చే పరిస్థితులకు దారితీశాయి.

ఆనందయ్య మావాడంటే... మా వాడని అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకవైపు కుమ్ములాడుకుంటుంటే, తగుదునమ్మా అంటూ మధ్యలో ఒక సాఫ్ట్‌వేర్ సంస్థ ఆ మందుని ఆన్‌లైన్‌లో పెట్టి అమ్మాలని చూస్తున్నట్లు అందరి సెల్‌ఫోన్‌లకు మెసేజీలు వచ్చి చేరాయి. ఈ వెబ్‌సైట్ వ్యవహారంలో వాస్తవాలు ఏమిటో ఆ వెబ్‌సైట్ తయారు చేసిన వ్యక్తులకి, ఆ సైట్‌కి మాకు సంబంధం లేదని చెప్పిన సంస్థ ప్రతినిధులకే తెలియాలి. కానీ ఇప్పుడు రాజకీయంగా ఈ అంశం పెద్ద దుమారాన్నే రేపింది. జరిగిన ఉదంతాన్ని మొత్తం పరిశీలిస్తే....



## ఈ వెబ్‌సైట్ కాకాణి పనే

**- సోమిరెడ్డి**

ఆనందయ్య మందు తమ వెబ్‌సైట్ ద్వారా లభిస్తుందని, ఒక్కో రకం మందుకి 15 రూపాయలు అవుతుందని, డెలివరీ చార్జీలు అదనం, ఆర్డర్ 3000 రూపాయలకు మించితే ఉచిత డెలివరీ చేస్తామన్నది ఆ సైట్‌లోని సారాంశం. అందులో ముఖచిత్రంగా ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి, ఆరోగ్య మంత్రి, కాకాణి, ఆనందయ్య బొమ్మలను ముద్రించారు. వెబ్‌సైట్‌లో విషయం కనపడగానే మాజీమంత్రి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి మీడియా ముందుకొచ్చారు. ఇది సర్వేపల్లి శాసనసభ్యుడు కాకాణి గోవర్ధనరెడ్డి పనే అంటూ ఆరోపించారు. ఆనందయ్య మందుని అడ్డం పెట్టుకుని కాకాణి దోచుకోవాలని చూస్తున్నాడని విమర్శించారు. ఆనందయ్యని తమ పార్టీ వాళ్ళు కలవాలన్నా పోలీసు అనుమతి తీసుకోవాలని, ఆయన పోలీసు పహారాలో ఉన్నాడని అన్నాడు.

## నీకు దమ్ముంటే రుజువు చెయ్యి

**- కాకాణి**

సర్వేపల్లి శాసనసభ్యుడు ఈ విషయంలో కొంచెం... కొంచెం కాదు లేండి ఎక్కువగానే స్పందించారు. నీకు దమ్ముంటే, నువ్వు ఒక అమ్మా అబ్బకు పుట్టుంటే నీ ఆరోపణ రుజువు చెయ్యి అంటూ బజారు భాషలో ధ్వజమెత్తారు. ఇంకా నీచమైన పదాలతో మాటల దాడి చేశారు. యంయల్‌ఏ మందు పంపిణీ చేస్తున్నాడని, ఆరోపిస్తున్నావు యంయల్‌ఏ కాకపోతే ఇంకెవరు పంచుతారంటూ దిగజారుడు భాషతో ప్రశ్నించారు.

## శృతిమించిన విమర్శలు... క్షోభిస్తున్న పెద్దల ఆత్మలు...


రాజకీయాలలో విమర్శలు ప్రతి విమర్శలు సర్వ సాధారణమే. అయితే జిల్లా రాజకీయ చరిత్రలో ఎప్పుడు లేనివిధంగా గతించిన పెద్దలను కూడా తెరపైకి తేవడమే ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. కాకాణి విమర్శలకు తీవ్రంగా స్పందిస్తూ సోమిరెడ్డి వర్గీయులు కూడా అంతే స్థాయిలో గతించిన పెద్దల ప్రస్తావన తెస్తూ సామాజిక మాధ్యమాలలో వీడియోలు పెడుతున్నారు. దేశంలో ఇతర ప్రాంతాలలో ఎలావున్నా మన రాష్ట్రం వరకు చూస్తే, ముఖ్యంగా నెల్లూరు జిల్లా రాజకీయాలను ఒక్కసారి పరిశీలిస్తే ఇలాంటి సంప్రదాయం మన జిల్లా నేతలకు ఎప్పుడూ లేదు. ఇలాంటి విమర్శలు ఎవరు చేసినా... తప్పే అంటూ ఇరుపార్టీల నాయకులూ చర్చించుకుంటున్నారు. నిన్నటి తరం నేటి తరం నాయకులూ కలసి పాత తరం పెద్దోళ్ళ ఆత్మలను క్షోభపెడుతున్నారని వాపోతున్నారు. శృతిమించిపోతున్న ఈ మాటల దాడి భవిష్యత్తులో ఎలాంటి విపత్కర పరిస్థితులకు దారి తీస్తుందోనని ఆవేదన చెందుతున్నారు.


## అయోమయంలో ఆనందయ్య...

అనవసరమైన రాజకీయ రొచ్చులో ఇరుక్కున్న ఆనందయ్య ఇప్పుడు అయోమయంలో పడ్డారు. ఇదేం ఖర్మరా నాయనా అంటూ ఆయన తల పట్టుకుంటున్నారని ఆయన శిష్యులు చెప్తున్నారు. ఆయన పాటికి ఆయనను వదిలేస్తే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా మందు పంపిణీ చేస్తారని అంటున్నారు. అయితే సర్వేపల్లి నియోజకవర్గం మొత్తం పంపిణీ అయ్యాకే మిగతా ప్రాంతానికి మందు పంపిణీ చేస్తామని ఆనందయ్య స్వయంగా ప్రకటించడం వెనుక మర్మమేమిటో తమకు కూడా అర్ధం కావడంలేదని వాళ్ళు చెప్తుండడం గమనార్హం.

# కరోనా కాటుతో విలవిల

జిల్లాలో కరోనా మహమ్మారి వ్యాధి తగ్గిపోతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ ఆ వ్యాధి ఎంతోమందిని పట్టి పీడిస్తూనే ఉంది. ఈనెల 9న బుధవారం మరో ఇద్దరు ఈ వ్యాధికి బలైపోయారు. ఇదేరోజున 4160 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తే 391 మందికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణ జరిగింది. కోవిడ్ కేర్ సెంటర్లలో 512 మంది ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం 9248 యాక్టివ్ కేసులున్నాయి. జిల్లాలో ఇప్పటిదాకా మొత్తం 1,22,148 మంది కరోనా బారిన పడగా, 1,12,501 మంది కోలుకున్నారు. ఇప్పటివరకు ఈ వ్యాధితో మరణించినవారి సంఖ్య 868కి చేరుకుందని సమాచారం. ఈ నేపథ్యంలో అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని, కోవిడ్ నిబంధనలు పాటిస్తూ కరోనాకి దూరంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.





## కరోనా కష్టాల్లో కూడా

# జనంపై కరుణ చూపిన జగన్

## అయినా.. 2024లో ఓటుకు నోటు లేకుండా ప్రజలు జగనన్నని కరుణిస్తారా?

***కరోనా పుణ్యమా అని గత ఏడాదిగా స్కూల్స్ తెరవడంలేదు, అయినా జగనన్న అమ్మ ఒడి పథకం కింద 13 ,000 కోట్లు ఇచ్చారు. కరోనా కారణంగా హాస్టళ్ళు మూసేశారు, కానీ జగనన్న వసతి దీవెన 2,270 కోట్లు అకౌంట్లలో పడిపోయాయి. కాలేజీలు తెరచుకోలేదు, కానీ జగనన్న విద్యాదీవెన కింద 4,879.30 కోట్లు ఇచ్చారు. విదేశాలకు విమానాలు తిరగడం లేదు, కానీ విదేశీ విద్యా దీవెన పథకం కింద 112.46కోట్లు ముట్టచెప్పారు... ఇలా చెప్పుకుంటూపోతే గత రెండేళ్లలో 24 పథకాలకు గాను మొత్తం సుమారు 95,528 కోట్లరూపాయలు నేరుగా బ్యాంకు అకౌంట్ల ద్వారా, మరో 36,197 కోట్ల రూపాయలు మరో ఇతర 7 పథకాల ద్వారా ప్రజలకు చేరిపోయాయి. అన్నీ కలిపి 31 ప్రభుత్వపథకాల ద్వారా మొత్తం 1,31,725.55 కోట్ల రూపాయలు ఆంధ్రా ప్రజలు అందుకున్నారు. మరి రేపు 2024లో ఓటుకి నోటు లేకుండా వీళ్ళు తమ జగనన్నని కరుణిస్తారా...? ఇది ఇప్పుడు జగనాంధ్ర ప్రదేశ్‌లో సర్వత్రా వినిపిస్తున్న ప్రశ్న.***

రెండేళ్లలో ఒక లక్షా ముప్పై ఒక్క వేలా ఏడువందలా ఇరవై అయిదు కోట్ల రూపాయలు ఆంధ్రా ముఖ్యమంత్రి వై యస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పంచిపెట్టారు. ఈ డబ్బులు ప్రభుత్వ ఖజానా నుండి ఇచ్చారా...? లేక అప్పులు తెచ్చారా...?? ఇంకేమైనా చేశారా...??? అన్నది ఇక్కడ అప్రస్తుతం. తన సుదీర్ఘ పాదయాత్రలో జగన్ చెప్పినవన్నీ చేసుకుంటూ వస్తున్నారు. చెప్పనివి కూడా చేసి చూపిస్తున్నారు. ఒక వేళ ప్రభుత్వ డబ్బులే అయితే అంత ఎక్కడినుండి వస్తుంది..? కాదు అప్పు తెస్తే మళ్ళా ఎలా తీరుస్తారు ...?? ఇవన్నీ కూడా సమాధానం దొరకని ప్రశ్నలైనప్పటికీ ఆ పద్దులన్నీ లెక్కల మాంత్రికుడు ప్రస్తుత వైయస్ఆర్ పార్టీ నాయకుడు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి చూసుకుంటాడు.

ఇక్కడ రాజకీయ జ్ఞానులకు, అజ్ఞానులకు సమాధానం దొరకని ప్రధాన ప్రశ్న ఒక్కటే... ఈ రోజు జగనన్న ఇచ్చే లక్షల కోట్ల డబ్బులు అప్పనంగా తీసుకుంటున్న ప్రజలు రేపు 2024లో జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఓటు వేస్తారా...?

ఈ విషయంపైన కొంతమంది పనీ పాటా లేని రాజకీయ విశ్లేషకులు ఇటీవల ఒక రహస్య సర్వే చేశారని సమాచారం. రాష్ట్రంలో ఎక్కడ చూసినా జగనన్న పాలనకు ప్రజలు బ్రహ్మరధం పడుతున్నారట. 2019 కంటే ఎక్కువ స్థాయిలో జగన్‌కి జై అంటున్నారట. అయితే, 2024లో మొత్తం 175సీట్లు ఆయనకే ఇచ్చేస్తారా..? ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఓటు వేస్తారా..?? అని అడిగితే విచిత్రమైన సమాధానం వచ్చిందట. ఇప్పుడు ఆయన మాకు ఇచ్చేది ప్రభుత్వ సొమ్ము, ఎన్నికలలో మాకు పంచేది నేతలు దోచుకున్న సొమ్ము. దానికీ దీనికీ ఏం సంబంధం..? ఇది ఇదే... అది అదే... అంటూ సమాధానమిచ్చారంట. ఈ సమాధానం విన్న ఆ రాజకీయ విశ్లేషకులు నోరెళ్లబెట్టారని వార్త.

వైయస్ఆర్ పార్టీ శ్రేణుల లెక్క ప్రకారం (గత నెల 30వ తేదీన సాక్షి దినపత్రికలో విజయసాయిరెడ్డి ఇచ్చిన ప్రకటన ఆధారంగా) ఇప్పటివరకు ఈ రెండేళ్లలో రాష్ట్రంలో వివిధ పథకాల ద్వారా లబ్దిపొందిన వారి సంఖ్య సుమారు 8 కోట్లా 90 లక్షల మంది. అంటే ఒక్కొక్క ఏడాదికి 4 కోట్లా 45 లక్షల మంది లబ్ది పొందారు. ప్రస్తుతం ఆంధ్రా జనాభా కూడా నాలుగున్నర కోట్ల మందే. అంటే వారి లెక్కల రమారమి ప్రతి పౌరుడూ ప్రభుత్వ పథకాన్ని పొంది వుండాలి. నిజంగా ఆలా జరిగే వుంటే, ఇప్పుడు వాళ్ళు వెలిబుచ్చుతున్న అభిప్రాయం విన్న తరువాతైనా ఈ పథకాలకు ఫుల్‌స్టాప్ పెట్టడం మంచిది. విశ్వాసనీయత పేరుతో ఇలా విశ్వాసం లేని జనానికి లక్షల కోట్ల రూపాయలు పంచి పెట్టడం బూడిదలో పోసిన పన్నీరే అవుతుందేమోనని పార్టీ వర్గాల్లో గుసగుసలు విన్పిస్తున్నాయి. గత ఎన్నికలలో తనకు సలహాదారుగా పెట్టుకున్న ప్రశాంత్ కిషోర్ టీం చేతనైనా జగన్‌మోహన్‌రెడ్డి కూడా రహస్య సర్వే చేయించుకుంటే మంచిదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆయన పంపకాల పథకాలను జనం మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తుంటే, మొన్న జరిగిన తిరుపతి పార్లమెంటు ఉపఎన్నికలో మెజారిటీ 5లక్షలు దాటి ఉండేదన్నది కూడా వారి అంచనా. అక్కడ పథకాల కంటే పైసలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు కాబట్టే మెజారిటీ తగ్గిందన్నది ఒక విశ్లేషణ.

ఇప్పటికైనా మునిగిపోయిందేమీ లేదు. జగన్‌మోహన్‌రెడ్డి మొదటి రౌండు పాలన ఇంకా 3 సంవత్సరాలు మిగిలి ఉంది. ఆ తరువాత కూడా మరో 15 సంవత్సరాలు ఉండాలన్నది ఆయన ఆకాంక్ష. మరి అలాంటప్పుడు ప్రతి ఏటా ఇలా లక్ష కోట్లు పంచుకుంటూ పోతే భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లోనే నోట్లు ప్రింటు చేయవలసి వస్తుందేమో అన్న అనుమానం ఐదేళ్లలో ఖర్చులను అంచనాలు వేస్తున్న దేశ వ్యాప్తంగా ఉన్న విజయసాయిరెడ్డి లాంటి లెక్కల మాంత్రికులకి కలుగుతోంది. వచ్చిందంతా ప్రజలకి పంచిపెడితే ఇక రాష్ట్రాభివృద్ధి పరిస్థితి ఏంటన్న అనుమానం జగన్ మోహన్‌రెడ్డి పథకాలను అందుకొనే సామాన్యుడికి కలుగుతోంది.

కరోనా సమయంలో సైతం ఇంత కరుణ చూపుతున్న జగన్‌మోహన్‌రెడ్డిపై అసలు కరుణే లేని ఈ స్వార్ధపూరిత జనానికి ఉచిత పథకాలు అవసరమా అన్న ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నం అవుతోంది. ఇప్పుడు ఎంతిచ్చినా అప్పుడు కొంత ఇవ్వాల్సిందేనన్న తెలుగు ఓటరు మనోగతం విన్న వారికెవరికైనా ఇదే అభిప్రాయం కలుగుతుంది.




## 'ప్రభా'తం

# సాగరాలా!..కాలుష్య కాసారాలా?

మనకు ప్రాణవాయువునిచ్చి బతికించే సముద్రాలను మనం కలుషితం చేస్తున్నాం. మనం వేసే చెత్తాచెదారంతో పాటు రసాయనాలు, వ్యర్థపదార్థాలన్నీ కుప్పలుతెప్పలుగా సముద్రాల్లోకి చేర్చడం ద్వారా సముద్రాలు కలుషితమవుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉంటున్నాం. సముద్రం ఉప్పు తిని బతుకుతూ, సముద్రాలకే ముప్పు తెస్తున్నాం. కానీ చివరికి ఆ ముప్పు అంతా మానవాళికే వచ్చిపడుతుందని, కాలుష్యం పెరిగితే భూ తాపం పెరిగి సముద్రాల్లో మార్పులు జరిగి మానవాళికి పెను ప్రమాదం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా ప్రతిఒక్కరూ కళ్ళు తెరవాలి. సముద్రాల్లోకి ఎలాంటి వ్యర్థాలు చేరకుండా ఎక్కడికక్కడ నివారించాలి. కాలుష్యాన్నుంచి సముద్రాలను కాపాడుకోవాలి. మనకు ప్రాణభిక్ష పెడుతున్న సాగరమాతలను కన్నతల్లి కన్నా మిన్నగా చూసుకోవాలి. సముద్రాలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి!.

ఎక్కడ చూసినా కాలుష్యం కాలుదువ్వుతున్న వేళ..పీల్చే గాలి..తాగే నీరు..తినే ఆహారం అంతా కలుషితమే. ఈ భూగోళమంతా కాలుష్యగోళంగా మారిపోతున్న కాలమిది. చివరికి మానవుడికి స్వచ్ఛమైన ప్రాణవాయువునిచ్చి బతికించే సముద్రాలు కూడా కాలుష్యం కోరల్లో పడిపోతున్నాయి. ప్రపంచంలో అనేకమంది సముద్రాలకు దూరంగా ఉండేవారూ లేకపోలేదు. సముద్రాలను సినిమాల్లోనో.. ఫోన్లు, కంప్యూటర్లలోనో కాక నేరుగా కళ్ళతో చూడని వాళ్ళు కూడా కొల్లలుగానే ఉంటారు. వాళ్ళకి కూడా ఆక్సిజన్ ఇచ్చి ప్రాణాలు కాపాడేది ఆ సముద్రాలేనన్న సంగతి బహుశా వారికి తెలిసుండకపోవచ్చు. మానవ జీవితానికి, సాగరాలకీ తల్లికి బిడ్డకు ఉన్నంత అనుబంధం ఉందన్న విషయం ఎందరికి తెలుసు?..అసలు భూమిలో 70 శాతానికి పైగా ఉండేది మహా సముద్రాలే. భూమి మీద నాలుగు వంతులు సముద్రాలుంటే ఒక్క వంతు మాత్రమే భూమి. ఆ భూమే సకల జనులకు ఆవాసం. అయితే, ఒక్క మానవాళినే కాదు, సకల జీవరాశులను, సకల ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడేదీ సాగరమాతలే. ఈ భూగోళం మొత్తమ్మీద 5 మహాసముద్రాలతో పాటు, మరో 110 దాకా చిన్న సముద్రాలున్నాయని శాస్త్రవేత్తలు లెక్కలు కట్టారు. వర్షాలు వచ్చేందుకు, చల్లని వాతావరణం ఏర్పడేందుకు, పర్యావరణం సమతుల్యతకు సముద్రాలు చేసే మేలు అంతా ఇంతా కాదు. మొత్తంగా భూమండలాన్నంతటినీ అత్యంత ప్రభావితం చేసేది సాగరాలే. అంతెందుకు.. ప్రాణవాయువే లేకపోతే మానవాళి ఏమవుతుందో అందరికీ తెలిసిందే. సాధారణంగా ప్రాణవాయువు మనకు చెట్లనుంచి వస్తుంటుందని అనుకుంటుంటాం కానీ, మనం ఊపిరి పీల్చుకునే ప్రాణవాయువు(ఆక్సిజన్)లో 70శాతం దాకా సముద్రాల నుంచే తయారై వస్తుంటుంది. మిగిలిన కొద్ది శాతం మాత్రమే చెట్ల నుంచి, ప్రకృతి నుంచి వస్తుంది. అంతేకాదు మానవాళి వదిలే బొగ్గుపులుసు వాయువును పీల్చుకుని వాతావరణాన్ని నియంత్రించేదీ సముద్రాలే. అదేవిధంగా, భూమి మీద ఉన్న నీటి పరిమాణం మొత్తంలో 97 శాతం నీళ్ళుండేది కూడా సముద్రాల్లోనే. సముద్రాలు ఉప్పునీటితో ఉన్నా తీరంలో అంతా మంచినీళ్లే ఉంటాయి. అందువల్లనే సాగరతీరాల్లో ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది జనం హాయిగా నివసిస్తుంటారు. ప్రకృతి వాతావరణాన్ని మార్చి మానవాళికి ఇబ్బందులు లేకుండా ఉష్ణోగ్రతలను సైతం నియంత్రిస్తూ మానవాళికి మహోపకారం చేస్తున్నది సముద్రాలే. అనేక రకాలైన వ్యాపారాలు, రవాణాలు అన్నీ సముద్రాల మీదనే చేస్తున్నాం. ప్రపంచంలో కోట్లాదిమంది ప్రజలు సముద్రాల మీదే ఆధారపడి జీవిస్తున్నారు. మనకెంతో అవసరమైన చమువు, సహజవాయువు వగైరాలన్నిటినీ సముద్రాలను లోడి మరీ తెచ్చుకుంటున్నాం. మనకిష్టం వచ్చినట్లుగా సముద్రాలను వినియోగించుకుని హాయిగా జీవిస్తున్నాం. ఎంతగానో సుఖపడుతున్నాం. అయినప్పటికీ సముద్రాలంటే మనం చులకనగానే చూస్తున్నాం. పీల్చే గాలిని, తాగే నీటిని, తినే ఆహారాన్ని అపారంగా ఇచ్చి మానవులకు ప్రాణాధారంగా, జీవనాధారంగా మారిన సముద్రాల పట్ల ఏమాత్రం కృతజ్ఞత లేని మానవుడే తన స్వార్థం కోసం వాటిని కలుషితం చేస్తుండడం మరింత విచారకరం. అపారమైన మత్స్య సంపదను, అంతులేని సాగరసంపదను అనుభవిస్తున్నా సముద్రాలను కాపాడుకోవడం పోయి వాటిని దుర్గంధభూయిష్టం చేస్తూ, రకరకాల వ్యర్థపదార్థాలతో సాగరాలను కాలుష్య కాసారాలుగా మారుస్తున్నాం. సముద్రం ఉప్పు తిని బతుకుతూ, సముద్రానికే ముప్పు తెస్తున్నాం. చేజేతులా వినాశనాన్ని కొని తెచ్చుకుంటున్నాం. భూమ్మీద ఉన్న చెత్తాచెదారం, కాలుష్యమంతా కాలువలు, నదుల ద్వారా అటుతిరిగి ఇటుతిరిగి చివరికి సముద్రాల్లోకే చేరిపోతోంది. అనేకరకాల పరిశ్రమల వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాలు, ప్రమాదకరమైన రసాయనాలు, వాడి పారేసిన ప్లాస్టిక్ సామగ్రి అంతా సముద్రాల్లోకే తరలిస్తున్నాం. ఏటా కోట్లాది టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లో చేరిపోయి సాగరాలు కాలుష్యమయమైపోతున్నాయని, ఆ వ్యర్థాలను తిని సముద్రజీవులు కోట్లాదిగా మృత్యువాత పడుతున్నాయని నిపుణులు పదేపదే హెచ్చరిస్తున్నా కాలుష్య నివారణకు శ్రద్ధ తీసుకునే నాధులు కనిపించడం లేదు. కోటానుకోట్ల జీవరాశులకు పుట్టినిల్లయిన సముద్రాలను కాలుష్యంతో నింపి ఆ జలచరాలు, సముద్రజీవుల మరణాలకు కారణమవుతున్నాం. ఈ కాలుష్యంతో కర్బన ఉద్గారాలు అంతకంతకూ పెరిగిపోతూ జీవజాతులు క్రమేణా అంతరించిపోతున్నాయి. రోజురోజుకీ కాలుష్యం విపరీతంగా పెరిగి భూతాపం పెరిగి ధృవాల్లోని మంచు కూడా కరిగిపోతూ ఉందని, సముద్ర మట్టాలు పెరుగుతున్నాయని, సముద్రాల్లో నీరు వేడెక్కితే తుఫాన్లు, సునామీల వంటివి పెరిగి జనావళికి ముప్పు తప్పదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా అందరూ కళ్ళు తెరవాలి. సముద్రాలు కలుషితం కాకుండా కాపాడుకోవాలి. అందుకే ఐక్యరాజ్యసమితి గతంలో వచ్చిన సునామీ భీభత్సాన్ని చూసి సముద్రాలు కలుషితం కాకుండా వాటి రక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేసేలా మానవాళిలో చైతన్యం కలగాలని భావిస్తూ 2009 నుంచి ప్రతి ఏటా జూన్ 8న 'ప్రపంచ సాగర దినోత్సవాన్ని' నిర్వహించాలని నిర్ణయించింది. కాలుష్యపదార్థాలు చేరడంతో రానున్న ముప్పులను వెంటనే గమనించి సముద్రాల్లోకి ఎలాంటి వ్యర్థాలు చేరకుండా ఎక్కడికక్కడ నివారించాలి. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలను వాడడం, వాటిని సముద్రంలో పారవేయడాన్ని పూర్తిగా మానుకోవాలి. ఒక్కమాటలో చెప్పాలంటే..ప్రతిఒక్కరూ మనకు ప్రాణభిక్ష పెడుతున్న సాగరాలను కన్నతల్లి కన్నా మిన్నగా చూసుకోవాలి. అప్పుడే సాగరదినోత్సవానికి అసలైన సార్థకత!..

### జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారికి..

# వేడుకగా వెండి వాహనసేవలు



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని మల్లికార్జున సమేత శ్రీ కామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 8, 9 తేదీల్లో అమ్మవారికి, స్వామివారికి ఎంతో వైభవంగా వెండి నందిసేవ, వెండి రథోత్సవ సేవలను నిర్వహించారు. కోవిడ్ నేపథ్యంలో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఏకాంతంగా జరుగుతున్నాయి. 8వ తేది బుధవారం రోజున స్వామివారిని, అమ్మవారిని వెండి నందివాహనంపై కొలువుదీర్చి ప్రత్యేకపూజలు చేశారు. 9వ తేది ఉదయం వెండి రథోత్సవం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.వెంకట శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతున్నాయి.

# మంత్రి గౌతంరెడ్డికి.. నాయకుల ప్రశంసలు

### పదవి చేపట్టి రెండేళ్ళైన సందర్భంగా ఏఎస్‌పేటలో సంబరాలు



రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి పేదల మనిషిగా ఉంటూ, రాష్ట్రంలోని పేదప్రజల సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తుండడం ఎంతో అభినందనీయమంటూ ఏఎస్‌పేట మండల వైకాపా కన్వీనర్ పందిళ్ళపల్లి సుబ్బారెడ్డి కొనియాడారు. మేకపాటి గౌతంరెడ్డి రాష్ట్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి ఈనెల 8వ తేదికి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఏఎస్‌పేట బస్టాండ్ సెంటర్లో వైకాపా నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ రెండేళ్ళ కాలంలో ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రి గౌతంరెడ్డి ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని ప్రశంసించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సోమశిల జలాలను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి పెద్దఎత్తున నిధులు మంజూరుచేయించి పనులు ప్రారంభించారని సంతోషం వ్యక్తం చేశారు. అటు రాష్ట్రంలోనూ, ఇటు జిల్లాలోను, ప్రత్యేకించి తన సొంత నియోజకవర్గమైన ఆత్మకూరులోను మంత్రి గౌతంరెడ్డి గతంలో ఎన్నడూ లేనంతగా ప్రజల అభివృద్ధి కోసం అనేక చర్యలు చేపట్టారన్నారు. ఈ సంబరాల్లో ఏఎస్‌పేట సర్పంచ్ జిలానీబాషా, ఏఎస్‌పేట, హసనాపురం వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'లాయర్' 40 ఏళ్ళ ప్రస్థానం.. పత్రికా రంగానికే గర్వకారణం

'లాయర్' 40ఏళ్ళుగా నిరంతరాయంగా వస్తుండడం ఎంతో ఆనందకరం, పత్రికా రంగానికే గర్వకారణం. 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులైన స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారి గురించి పాతతరం వారందరికీ తెలిసిందే! ఆయన ఎవరి బెదిరింపులకు జడిసేవారు కాదని, ఏ విషయమైనా ఉన్నది ఉన్నట్లు రాస్తారని మంచి పేరు సంపాదించారు. నిజానికి మసిపూసే అబద్ధపు రాతలను ఆయన ఏనాడూ రాయరని అందరికీ తెలిసిందే! మంచిని పెంచుతూ, చెడును తుంచుతూ పత్రికా రంగంలోనే ఆణిముత్యంగా రాజగోపాలరెడ్డిగారు 'లాయర్'ను తీర్చిదిద్దారు. అందుకే 'లాయర్' పత్రిక నిజాల పత్రికగా.. ప్రజల పత్రికగా.. నేటికీ అశేష జనాదరణ పొందుతోంది. ఆయన వారసుడైన వారి కుమారుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి అక్షరాలా ఆయన అక్షరాలకు, లక్షణాలకు వారసుడై.. ఆయన ఆశయాల బాటలో 'లాయర్' పత్రికను ఎంతో సమర్ధవంతంగా.. నీతిగా.. నిర్భీతిగా.. నిజాయితీగా నడిపిస్తుండడం ఎంతైనా అభినందనీయం. 'లాయర్' పత్రిక.. మరింత యశస్సుతో.. చిరకాలం వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నా.

– ఆర్‌పి రామయ్య, నెల్లూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

### శీర్షికలు, కథనాలు

# ఎంతో బాగున్నాయి

'లాయర్'లో వారం వారం వస్తున్న శీర్షికలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకించి విశేషమైన వార్తలు, ప్రత్యేక కథనాలు, మానవీయ వార్తలకు 'లాయర్' ఒక మంచి వేదికగా ఉంటోంది. 'లాయర్' 40 ఏళ్ళుగా తనదంటూ ప్రత్యేకమైన శైలితో స్థానిక పత్రికా రంగంలోనే ఒక విశిష్టమైన పత్రికగా నిలదొక్కుకుంటూ, ఇన్నేళ్ళుగా ప్రజల, పాఠకుల ఆదరాభిమానాలను పొందుతుండడం ఎంతైనా విశేషం. 'లాయర్' 40 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'లాయర్'కు మా అభినందనలు.. శుభాకాంక్షలు.

– ఎంవిఎస్ సుబ్బారెడ్డి, కోవూరు.

# నెల్లూరు కబుర్లు తెలిసేది 'లాయర్' ద్వారానే

'లాయర్' పత్రిక 40 వసంతాలు పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషం కలిగిస్తోంది. నెల్లూరీయులకు 'లాయర్' చదవాలంటే ఎంతో ఇష్టం. ఒక్క నెల్లూరులోనే కాదు, నెల్లూరోళ్ళు ప్రపంచంలో ఏ మూల ఉన్నా నెల్లూరు కబుర్లు తెలుసుకునేది 'లాయర్' పత్రిక ద్వారానే. మేము ఢిల్లీలో ఉన్నా నెల్లూరు సంగతుల కోసం 'లాయర్' చదువుతుంటాం. అందులోనూ 'లాయర్'లో వార్తలు నిష్పాక్షికంగా ఉంటాయి. ఎన్నో సంచలనాత్మకమైన కథనాలు 'లాయర్'లో మేము చదివాం. ప్రజల పత్రికగా 'లాయర్'కు ఎంతో మంచి పేరు ఉంది. మరో పది కాలాల పాటు 'లాయర్' ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని మనసారా కోరుకుంటున్నాము.

– ఎం.చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

# 'లాయర్' అంటే మాకెంతో అభిమానం

పత్రికలు ఎన్నో పుడుతుంటాయి కానీ ఎక్కువ కాలం జీవించాలంటే ఎంతో కష్టసాధ్యం. మన కళ్ళ ముందే పుట్టి, మళ్లీ అదృశ్యమైన పత్రికలకు లెక్కే లేదు. అలాంటి పరిస్థితుల్లో..అందులోనూ ఒక ప్రాంతీయ పత్రిక 40 ఏళ్ల పాటు నిరంతరాయంగా, క్రమం తప్పకుండా వెలువడుతుండడం ఎంతైనా అద్భుతం. వాస్తవాలను ప్రజలకు తెలియజేయడంలో 'లాయర్' ముందుంటోంది. అందుకే మాకు 'లాయర్' అంటే ఎంతో అభిమానం. క్రమం తప్పకుండా మేము ప్రతివారం 'లాయర్' చదువుతుంటాము. నెల్లూరు జిల్లాకు చెందిన చిన్న పత్రికల్లో ఇన్నేళ్ళ పాటు పెద్దపత్రికల కంటే ధీటుగా రాణిస్తూ పాఠకులందరి చదివి మెచ్చుకునే గొప్ప పత్రికగా పేరు తెచ్చుకున్న 'లాయర్'ను ఎంతైనా అభినందించక తప్పదు.

– కె.వెంకటరమణయ్య, కావలి.



## కరోనా కట్టడికి..

# 'వెస్ట్ ఫార్మా' సహకారం ప్రశంసనీయం

**- ఎమ్మెల్యే సంజీవయ్య**

కరోనా కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ఎంతగానో శ్రమిస్తోందని, శ్రీసిటీకి చెందిన పరిశ్రమల వారు కూడా ఈ కృషికి సహకరిస్తుండడం ఎంతో అభినందనీయమని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేటలోని కోవిడ్ కేర్ సెంటర్‌కు శ్రీసిటీలోని వెస్ట్ ఫార్మాసిటికల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఈనెల 7న దాదాపు 15 లక్షల రూపాయల విలువజేసే 20 ఆక్సిజన్ సిలిండర్లు, వెంటిలేటర్లు తదితర వైద్యపరికరాలను వితరణగా అందించడాన్ని ఆయన కొనియాడారు. ఇటీవల శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి 50 ఆక్సిజన్ సిలిండర్లతోపాటు ఫ్లోమీటర్లను కూడా అందజేశారని అంటూ కరోనా బాధితులకు వారందిస్తున్న సేవలను ప్రశంసించారు. వెస్ట్ ఫామ్ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ శ్రీహరి, రాకేష్‌రెడ్డి, తొగరాముడి హెల్త్ సూపర్‌వైజర్ జనార్ధనయ్య ఆధ్వర్యంలో పిహెచ్‌సిలకు అవసరమైన బెడ్లు, ఆక్సిజన్ సిలిండర్లను అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కోవిడ్ కట్టడికి కృషిచేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్యను వెస్ట్ ఫార్మా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఆ కంపెనీ ప్రతినిధులతో పాటు నాయుడుపేట మునిసిపల్ ఛైర్మెన్ కటకం దీపిక, మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ దయాకర్, డెప్యూటి తహశీల్దార్ శ్రావణ్‌కుమార్, వైకాపా నాయకులు ఒట్టూరు కిషోర్‌యాదవ్, కటకం జయ రామయ్య, పోట్లపూడి రాజేష్ పాల్గొన్నారు.

# సేవామూర్తి.. ఎందరికో స్ఫూర్తి.. పూండ్ల వెంకురెడ్డి

- చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రెండు దశాబ్దాలుగా మానవీయ సేవలు
- మహమ్మదాపురంలో వెయ్యిమంది నిరుపేదలకు నిత్యావసర సరుకులు



దాదాపు రెండు దశాబ్దాలుగా నెల్లూరులోని పూండ్ల వెంకురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అందరికీ తెలిసినవే. నగరంలో ఎవరైనా పేదలు మృతిచెందితే వారి మృతదేహాలను స్మశానవాటికకు తీసుకువెళ్లేందుకు స్తోమతు లేనివారికి సాయంగా నగరంలో నాలుగు స్మశాన శకటాలను కేటాయించి ఉచితంగానే సేవలందిస్తున్న సేవామూర్తి.. పూండ్ల వెంకురెడ్డి. అంతేకాదు నెల్లూరులో నిరుపేద వృద్ధులు, దివ్యాంగుల కోసం ఉచిత బస్సును కూడా నడుపుతున్న ఘనత ఆయనదే. తన జీవితాన్ని పేదల సేవకే అంకితం చేసిన పూండ్ల వెంకురెడ్డి నేతృత్వంలో 20 ఏళ్ళ క్రితం ప్రారంభమైన ఈ ట్రస్ట్ నగర ప్రజలకు, పేదలకు ఎనలేని సేవలందిస్తూ తన మానవీయతను చాటుకుంటూనే ఉంది. ట్రస్ట్ వ్యవస్థాపకుడైన పూండ్ల వెంకురెడ్డితో పాటు నిర్వాహకులు సుబ్బారెడ్డి, కుమార్, నిరంజన్‌నాయుడు తదితరుల ఆధ్వర్యంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇన్నేళ్ళుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదలను, దీనులను ఆదుకుంటూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో తన సొంత ఊరైన మహమ్మదాపురం గ్రామంలోని పేదలకు, చుట్టుపక్కల గ్రామాల్లోని పేదలకు కూడా ఈ కరోనా కష్టకాలంలో తనవంతు సాయం అందించాలని నిర్ణయించుకుని ఈనెల 6న ట్రస్ట్ ఆధ్వర్యంలో దాదాపు వెయ్యిమంది పేదలకు నిత్యావసర సరుకులు అందజేసి తన ఔదార్యం చాటుకున్నారాయన. కరోనా, లాక్‌డౌన్‌ల పరిస్థితుల్లో పనులు లేక జీవనం గడవక పస్తులుతో కాలం గడుపుతున్న ఎంతో మంది నిరుపేదలకు అండగా నేనున్నానంటూ తనవంతు సాయమందిస్తూ ఆయన అందరి అభినందనలు అందుకున్నారు. మహమ్మదాపురంలో పెద్దఎత్తున జరిగిన ఈ సేవా కార్యక్రమంలో పేదలకు చక్కెర, గోధుమపిండి, నూనెలు, సబ్బులు, బిస్కెట్లు, మామిడిపండ్లు వగైరాలన్నీ అందజేసి పూండ్ల వెంకురెడ్డి సేవాభావంలో అందరికీ స్ఫూర్తిదాయకమయ్యారు. ట్రస్ట్ తరఫున సుబ్బారెడ్డి, శివారెడ్డి, నిరంజన్ నాయుడు, శ్రీనివాసులురెడ్డి, శేషయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సేద్యం వస్తువులపై రైతులకు రాయితీ

**- వ్యవసాయశాఖ జేడీ శ్రీమన్నారాయణ**

వ్యవసాయ పరికరాలను రైతులకు 40శాతం రాయితీపై అందిస్తున్నామని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీమన్నారాయణ చెప్పారు. ఈనెల 5న ఆయన నెల్లూరు రూరల్ మండలంలోని గొల్లకందుకూరు గ్రామంలో జరిగిన వ్యవసాయ సలహామండలి సమావేశంలో మాట్లాడుతూ రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను కూడా 50 శాతం రాయితీతో ఇస్తున్నామని తెలిపారు. తొలుత ఆయన రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అందుతున్న సేవల విషయమై రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ దొరసానమ్మ, మండల వ్యవసాయ అధికారి జ్యోత్స్నారాణి, రైతులు పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





# అమెరికాలో ఉన్నా.. 'మీకోసం నేనున్నా'నంటున్న డాక్టర్ ప్రేమ్



- కోవిడ్ బాధితులకు 5 కోట్ల విలువైన వైద్యసామగ్రి వితరణ
- జన్మభూమి రుణం తీర్చుకుంటున్న మన నెల్లూరీయుడు

**అమెరికాలో ఉన్నా..మీకోసం నేనున్నానంటూ సేవాభావంతో కరోనా బాధితులను ఆదుకునేందుకు అక్షరాలా అయిదుకోట్ల రూపాయల విలువజేసే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, ఇతర వైద్యపరికరాలను అందజేసి తన ఔదార్యాన్ని చాటుకుంటూ అందరి అభినందనలు అందుకుంటున్నారు మన ప్రేమ్‌సాగర్‌రెడ్డి. దివంగత మహానేత డా. వైయస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో సేవా రంగంలో అగ్రభాగాన నిలిచారు. అగ్రదేశం అమెరికాలోనూ భారీ విరాళాలతో తన దాతృత్వాన్ని చాటుకుంటూ, ఎన్నో ఆసుపత్రులు నెలకొల్పి లక్షలాదిమంది ప్రజలకు అనితరసాధ్యమైన సేవలందిస్తూ ఎనలేని కీర్తిప్రతిష్టలందుకుంటున్న డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి మన నెల్లూరీయుడు కావడం సింహపురిసీమకే గర్వకారణం.**

నెల్లూరుజిల్లా నిడిగుంటపాళెం అనే కుగ్రామంలో పుట్టిన డాక్టర్ ప్రేమ్‌సాగర్ రెడ్డి అమెరికాలో ప్రఖ్యాత వైద్యునిగా స్థిరపడ్డారు. వైద్యరంగంలో అత్యద్భుతమైన ప్రజ్ఞాపాటవాలతో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేకస్థానం సాధించారు. తానెంతో ఉన్నత శిఖరాలను అధిరోహించినా గర్వమన్నది లేశమాత్రం కూడా లేక ఎంతో సహృదయంతో లక్షలాదిమందిని మానవతా దృక్పథంతో ఆదుకుంటూ ప్రపంచవ్యాప్తంగా అందరి ప్రశంసలందుకుంటున్నారాయన. ప్రత్యేకించి ఆయనకు జన్మభూమిపై మక్కువ ఎక్కువ. నెల్లూరు జిల్లాలోని తన సొంత ఊరైన నిడిగుంట పాళెం గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలు అపారం.. అమోఘం! అక్కడి ప్రజలు కష్టాలు ఉన్నారని తెలిస్తే చాలు.. వెంటనే వారిని ఆదుకునేందుకు తనవంతు సాయంతో ముందుకు వస్తుంటారాయన. దాదాపు 10 కోట్ల రూపాయలు వెచ్చించి ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తన తండ్రి ననమాల సుందర రామిరెడ్డి పేరుతో హైస్కూల్ భవనాన్ని నిర్మించి అధునాతనమైన రీతిలో అన్ని వసతులు కల్పించి చదువుల తల్లి కోవెలగా ఆ పాఠశాలను తీర్చిదిద్దారు. నిడిగుంట పాళెం దళిత కాలనీల్లో నాలుగున్నర కోట్ల రూపాయలు వెచ్చించి సిమెంట్ రోడ్లు వేయించారు. పేదల ఇళ్ళ నిర్మాణం కోసం మ్యాచింగ్ గ్రాంట్‌గా కోటి రూపాయలు విరాళంగా అందించారు. 15లక్షల రూపాయలతో గ్రామంలో తాగునీటి ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. జిల్లాలోని పలు గ్రామాల్లో కూడా కోటీ 25 లక్షలతో తాగునీటి సదుపాయం కోసం వాటర్ ప్లాంట్‌లను నెలకొల్పారు.

## కరోనా బాధితులకు భారీ సాయం :

ఇటీవల రాష్ట్రంలో కరోనా బాధితులు ఆక్సిజన్ సౌకర్యాలు లేక విలవిల లాడుతున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని దాదాపు 5కోట్ల రూపాయలు విలువ జేసే 500 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, వెంటిలేటర్లు, ఇతర వైద్యపరికరాలను పంపి మానవతా దృక్పధంతో కోవిడ్ బాధితులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన, ఆయన కుమార్తె కవితారెడ్డి (హెల్త్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్)లు ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కోవిడ్ బాధితులకు తొలివిడతగా ఈ సహాయం అందిస్తున్నామని, మరింత సహాయం కూడా అందిస్తామని పేర్కొన్నారు. భారతదేశంలో కరోనాతో ఏర్పటిన సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అందరూ ఒక్కతాటిపై కలసి రావాలన్నారు. ప్రస్తుత పరిస్థితులు వైద్య రంగం ఆసుపత్రులపై విపరీతమైన ఒత్తిడి పెంచుతోందని, ప్రాణాలను నిలబెట్టే ఆక్సిన్ కాన్సన్‌ట్రేటర్ల వంటి అత్యవసర పరికరాలను కోవిడ్ బాధితులకు సహాయంగా పంపుతున్నామని తెలిపారు. జూన్ 24వ తేది నాటికి ఆ వైద్యపరికరాలన్నీ రాష్ట్ర ప్రభుత్వానికి అందనున్నాయి కూడా.

## డాక్టర్ వైఎసార్ స్ఫూర్తితో సేవారంగంలోకి

నెల్లూరుజిల్లాలోని నిడిగుంటపాళెం గ్రామంలో జన్మించిన ప్రేమ్‌సాగర్‌రెడ్డి 1973 ప్రాంతంలో తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాలలో వైద్యవిద్య పూర్తిచేసి అనంతరం అమెరికాలో స్థిరపడ్డారు. 1981లో సదరన్ కాలిఫోర్నియాలో వైద్య వృత్తిలో అడుగుపెట్టిన డాక్టర్ ప్రేమ్ 1985లో మల్టీస్పెషాలిటీ మెడికల్ గ్రూప్‌ను నెలకొల్పి లక్షలాదిమందికి వైద్యసేవలు అందించారు. విశేషమైన తన ప్రజ్ఞా పాటవాలతో వైద్యరంగంలో ఎనలేని కృషి చేస్తూ అమెరికాలోని 14 రాష్ట్రాల్లో ప్రైమ్ హెల్త్‌కేర్ పేరుతో 46 ఆసుపత్రులను నెలకొల్పి అంతర్జాతీయ వైద్యరంగంలో ఆణిముత్యంగా ప్రకాశిస్తున్నారు. ఈ ఆసుపత్రుల్లో వేలాదిమంది వైద్యులు, సిబ్బంది ఉపాధి పొందుతున్నారు కూడా. అంతే కాదు, ప్రైమ్ హెల్త్‌కేర్ ఫౌండేషన్‌ను కూడా ఆయన స్థాపించి అంతర్జాతీయస్థాయిలో భారీగా సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించి తన జన్మను సార్థకం చేసుకుంటున్నారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న రోజుల్లో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి క్లాస్‌మేట్ అయిన డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రేమ్ హెల్త్‌కేర్ ఫౌండేషన్ స్థాపించి లక్షలాది మందికి వైద్యసేవలందిస్తున్న ఘనత డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డికే దక్కుతుంది. అమెరికాలోనే కాకుండా అటు రాష్ట్రానికి, ఇటు జిల్లాకు, తన సొంతవూరికి కూడా తనవంతు ఎనలేని సేవలందిస్తూ తన సేవాతత్పరతను చాటుకుంటున్న మహాదాత.. మానవీయమూర్తి.. డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డికి సింహపురిసీమ ప్రజలందరి తరఫునా 'లాయర్' అభినందనలు!.



స్వగ్రామమైన నిడిగుంటపాలెంలో ఆధునిక వసతులతో జడ్పీ హైస్కూలు



## పలు సొసైటీలు, బ్యాంకు ఛైర్మెన్‌లకు..

# ఎమ్మెల్యే ప్రసన్న అభినందనలు

సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆరునెలల పదవీకాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో కోవూరు నియోజకవర్గంలో రూరల్ బ్యాంక్‌లకు, పలు సొసైటీలకు అధ్యక్షులుగా నియమితులైనవారిని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అభినందించారు. ఈనెల 6న ఇందుకూరుపేట మండలంలోని ముదివర్తిపాళెంలో జరిగిన కార్యక్రమంలో వారిని అందరికీ పరిచయం చేసి సన్మానించారు. కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట మండలం కో–ఆపరేటివ్ రూరల్ బ్యాంకు ఛైర్మెన్‌గా మావులూరు శ్రీనివాసులురెడ్డి, నిడిముసలి ప్రాథమిక సహకార సంఘం ఛైర్మెన్‌గా కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, నియమితులయ్యారు. అదేవిధంగా పడుగుపాడు పిఏసిఎస్ ఛైర్మెన్‌గా రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, విడవలూరు మండలం పార్లపల్లి పిఏసిఎస్ ఛైర్మెన్‌గా తిక్కవరపు జనార్దన్‌రెడ్డి, ముదివర్తి పిఏసిఎస్‌కు కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, వరిణి పిఏసిఎస్‌కు తుమ్మల లక్ష్మయ్య, విడవలూరు పిఏసిఎస్‌కు యేనేటి ప్రసాద్, బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని వవ్వేరు రూరల్ బ్యాంకు ఛైర్మెన్‌గా సూరా శ్రీనివాసులురెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం రూరల్ బ్యాంకు ఛైర్మెన్‌గా మేనకూరు సీతారామరెడ్డి, దామరమడుగు పిఏసిఎస్ ఛైర్మెన్‌గా యనమల రవి, కొడవలూరు మండలం గంగవరం పిఏసిఎస్‌కు



పెనాక శ్రీనివాసులురెడ్డి, యల్లాయపాళెం పిఏసిఎస్‌కు యేకుల యుగంధర్‌రెడ్డి, తలమంచి పిఏసిఎస్‌కు సన్నారెడ్డి నందకుమార్‌రెడ్డి, గుండాలమ్మపాళెం పిఏసిఎస్‌కు వీరి చలపతిరావు నియమితులయ్యారని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తమ నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి రూరల్ బ్యాంకు ఛైర్మెన్లు, సొసైటీల అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు గూడూరు ప్రభాకర్‌రెడ్డి, ఉడతా వెంకటశేషయ్య, పెనుబల్లి కృష్ణ చైతన్య, పంబాల జనార్దన్‌రెడ్డి, వేణుంబాక మహీధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలతోనే మానవ మనుగడ

**- పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో డిఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి**

పర్యావరణాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా పరిరక్షించుకోవాలని, మానవ మనుగడకు మొక్కలు ప్రాణాధారం కనుక అందరూ మొక్కలు నాటి అవి ఏపుగా ఎదిగేలా కాపాడుకోవాలని డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి అన్నారు. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నెల్లూరు సంతపేటలోని తమ కార్యాలయంలో ఆమె మొక్కలు నాటి మాట్లాడుతూ కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు విరివిగా నాటుకోవాలన్నారు. పర్యావరణానికి ముప్పుగా తయారవుతున్న ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఎంఅండ్‌హెచ్‌ఓ స్వర్ణలత, డిపిఎంఓ సతీష్, హరిశ్చంద్ర గౌడ్, ఇన్‌చార్జి డిఎల్‌ఓ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.



## పచ్చదనానికి ప్రతీకగా..

# శ్రీసిటీలో ఉద్యానవనం

**- ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి వెల్లడి**

పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించే కార్యక్రమంలో భాగంగా పచ్చదనాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ శ్రీసిటీలో ఒక సుందరమైన ఉద్యానవం ఏర్పాటు చేస్తున్నామని శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి చెప్పారు. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శ్రీసిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రకరకాల పరాగ సంపర్క జాతులను పరిరక్షించేందుకు, ఆ జాతుల పరిరక్షణ ప్రాముఖ్యతను ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ పార్కును అభివృద్ధి చేస్తున్నామని, తేనె, పుప్పొడి ఉత్పత్తి చేసే మొక్కలతో సీతాకోకచిలుకలు, తేనెటీగలు, రకరకాల పక్షిజాతులను ఆకర్షించడానికి ఉపయోగపడేలా వచ్చే ఆగస్టు నాటికి ఈ ఉద్యానవనం ఏర్పాటయ్యేలా కృషిచేస్తున్నామన్నారు. పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించకుండా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించలేమని ఆయన స్పష్టం చేశారు. శ్రీసిటీలో ఒక మిలియన్ చెట్లను నాటే లక్ష్యానికి అతి చేరువలో ఉన్నామని తెలిపారు. సత్యవేడు ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్‌రావు మాట్లాడుతూ మొక్కల పెంపకంలో ప్రతిఒక్కరూ ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని కోరారు. శ్రీసిటీలో చెట్ల పెంపకం గురించి ఉద్యానవన విభాగం హెడ్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తాము ఇప్పటికే ఆరు ఎకరాల్లో జపనీస్ 'మియావాకి' పద్ధతిలో చెట్ల పెంపకం చేపట్టామని, 56 రకాల వృక్షజాతుల మొక్కలను పెంచడం జరుగుతోందని, ఈ ఏడాది మరో నాలుగు ఎకరాల్లో వాటిని పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మియావాకి చెట్ల పెంపకం పద్ధతిలో కొద్ది స్థలంలోనే ఎక్కువ చెట్లను నాటడానికి వీలు కలుగుతుందన్నారు. శ్రీసిటీ సెజ్ స్పెసిఫైడ్ ఆఫీసర్ కెవివి సత్యనారాయణ, శ్రీసిటీ పర్యావరణ విభాగం హెడ్ డాక్టర్ పి.వెంకటేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.




# దుంగలు వదిలేసి.. దొంగలు పరార్

## 3 లక్షల విలువచేసే ఎర్రచందనం పట్టివేత


పుచ్చకాయల కింద ఎర్రచందనం దుంగలు

ఎర్రచందనం అక్రమ రవాణాను నిరోధించే దుకు అధికారులు పటిష్ట మైన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో కొందరు దుండగులు మరింత చాక చక్యంగా రవాణా చేద్దామని పుచ్చకాయల లోడు కింద ఎర్రచందనం దుంగలు దాచి పెట్టి తీసుకువెళ్తూ మార్గమధ్యంలో చెక్ పోస్ట్ అధికారుల కంటబడ్డారు. అయితే ఈ ఘటనలో దుంగలు మాత్రం దొరి కాయి.. దుండగులు మాత్రం పారిపో యారు. ఈనెల 5వ తేది వేకువఝూమున ఆత్మకూరు మండలం పరిధిలో ఉన్న నెల్లూరుపాళెం సమీపంలో ఈ ఘటన జరిగింది. అధికారుల కథనం ప్రకారం.. ఆత్మకూరు సమీపంలోని నెల్లూరుపాళెం పరిధిలో ఉన్న చెక్‌పోస్ట్ అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక వాహనం చెక్‌పోస్ట్ దగ్గర ఆగకుండా రయ్‌మంటూ దూసుకుపోయింది. అధికా రులు వెంటనే అప్రమత్తమై వెంటపడగా ఆ వాహనాన్ని కొంతదూరం ముందుకు పోనిచ్చి అందులో ఉన్న డ్రైవర్, మరోవ్యక్తి పారిపోయారు. ఆ వాహనాన్ని పరిశీలిస్తే అందులో పుచ్చలకాయలతో పాటు వాటి కింద సుమారు 3 లక్షలకుపైగా విలువచేసే ఎర్రచందనం దుంగలున్నాయి. వాటిని దుండగులు నీళ్ళలో కొంతకాలం దాచిపెట్టి ఉంచినట్లుగా తెలుస్తోందని ఆత్మకూరు రేంజర్ హరి చెప్తున్నారు. బద్వేలు నుంచి నెల్లూరుకు వెళ్తున్న ఆ వాహనంతో పాటు దానిలో ఉన్న 30 ఎర్రచందనం దుంగ లను ఆత్మకూరు అటవీశాఖ కార్యాలయా నికి తరలించి వాహనం యజమానిపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. ఆ వాహనం కడపజిల్లాకి చెందినదిగా గుర్తిం చారు. తనిఖీల్లో రేంజర్‌తో పాటు విఆర్‌ఓ బుచ్చిరెడ్డి, చెక్‌పోస్టు సిబ్బంది పాల్గొన్నారు.

# 'మూడో ముప్పు'పై ముందుజాగ్రత్తలు తీసుకోండి

## సిఎంకు ప్రజారోగ్యవేదిక సూచన

అక్టోబర్-నవంబర్ నెలల మధ్యలో రానున్న కరోనా మూడో దశలో ముందు జాగ్రత్తలు తీసుకుని ప్రాణనష్టం జరగ కుండా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌కు ప్రజారోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి రమణయ్య, ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తిచేశారు. కరోనా రెండవదశ చాలా రాష్ట్రాల్లో తగ్గుముఖం పట్టినా... మన రాష్ట్రంలో ఇంకా కొనసాగుతూనే ఉందని, జూన్ చివరివారం ఈ రెండోదశ తగ్గ వచ్చుని నిపుణులు చెప్తున్నారని, ఈ నేప థ్యంలో అక్టోబర్ నెలలో రానున్న మూడవ దశ కరోనా పిల్లలపై తీవ్రప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు నిపుణులు హెచ్చరిస్తు న్నారని, రెండోదశ నియంత్రణలో జరిగిన వైద్య ఆరోగ్య రంగంలోని లోపాలను దృష్టిలో ఉంచుకుని మూడోదశను కట్టడి చేసేందుకు అవసరమైన ముందస్తు ప్రణా ళికలను వెంటనే సిద్ధం చేసుకోవాలని వారు సూచించారు. రాష్ట్రంలో నిపుణులైన చిన్న పిల్లల వైద్యులను, ఊపిరితిత్తుల నిపుణు లతో పాటు వైరాలజిస్టులు, మైక్రోబయాల జిస్టులు, నవజాత శిశువైద్య నిపుణులతో కూడిన కమిటీని నియమించి వారికి దిశా నిర్దేశం చేయాలన్నారు. రెండోదశ అవస రాలను పరిగణనలోకి తీసుకుని అందుకవ సరమైన ఆసుపత్రులు, ఆక్సిజన్, ఆక్సిజన్ పడకలు, మందులు, ఐసియు పడకలు, వెంటిలేటర్లను వెంటనే సిద్ధం చేసుకోవా లని, ప్రతి కమ్యూనిటీ సెంటర్లో 30 పడక లలో 10 పడకలను ప్రత్యేకించి చిన్నపిల్లల కోసం కేటాయించాలని, వైద్యసిబ్బందికి చిన్నపిల్లల వైద్యచికిత్స అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరారు. జిల్లాలో చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, నర్సింగ్ సిబ్బందిని పెంచాలని పేర్కొన్నారు.

# స్మశానవాటిక సిబ్బందికి.. రోటరీ సాయం

నెల్లూరు నగరంలోని బోడిగాడితోట స్మశానవాటికలో పనిచేసే సిబ్బందికి ఈనెల 5న నెల్లూరు రోటరీక్లబ్ సౌత్ ఆధ్వర్యంలో 30 పిపిఇ కిట్లు అందజేశారు. డాక్టర్ రాధిక సహకారంతో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు సతీష్‌కుమార్, ప్రస్తుత అధ్యక్షుడు వసంతరావుతో పాటు స్మశానవాటిక మునిసిపల్ ఇన్‌చార్జి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. కోవిడ్ ద్వారా మృతిచెందిన వారి శవాలను సైతం స్మశానవాటికలోకి మోసుకునివచ్చి దహన, ఖనన కార్యక్రమాలు చేసే సిబ్బందికి అవసరమైన పిపిఇ కిట్లను అందజేశారు. కరోనా నేపథ్యంలో, తమ వారి శవాలతో పాటు స్మశానానికి రావడానికే వారి కుటుంబసభ్యులు భయపడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రోటరీక్లబ్‌వారు నేరుగా స్మశానానికే వచ్చి సిబ్బందికి ఈ కిట్లను అందజేయడం పట్ల సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

# పిడుగు పడి.. 30 మేకలు మృత్యువాత

## - గోడుగోడుమంటున్న యజమానులు



తమకు జీవనా ధారమైన 30 మేకలు ఒకేసారి పిడుగు పడి మృతిచెందడంతో వాటిని పెంచుకుం టున్న యజమానులు గోడుగోడుమంటు న్నారు. వరికుంట పాడు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఈ దుర్ఘటన జరిగింది. ఈనెల 5వ తేది రాత్రి ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. దొడ్లో ఉన్న మేకలపై పిడుగు పడడంతో అవన్నీ ఒక్కసారిగా మరణించాయి. మేకలదొడ్డిపై పిడుగుపడిన విషయం తెలిసిన వెంటనే గ్రామసర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, పెద్దపల్లి పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ, పంచాయతి కార్యదర్శి వివ కుమార్, విఆర్‌ఓ ప్రసాద్ తదితరులంతా ఆ ప్రదేశానికి వెళ్ళి చనిపోయిన మేకలను పరిశీలించారు.వాటి విలువ సుమారు రెండున్నర లక్షల రూపాయల దాకా ఉంటుందని వాటి యజమానులు కంచర్ల వెంకటరావు, కంచర్ల వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దయతలచి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక

40 ఏళ్ళుగా సాగుతున్న నిరంతర వార్తాసంకలనం
ప్రాంతీయ పత్రికా ప్రపంచంలో సంచలనం
లాయర్
వారపత్రికకు
40వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

40 లాయర్ YEARS

డా॥ నాగార్జున
సంధ్యారాణి

డా॥ దీపక్
డా॥ దివ్య

డా॥ సృజన
డా॥ సందీప్



## జొన్నవాడ కామాక్షమ్మ సేవలో.. గోవిందానంద సరస్వతి



కర్నాటకకు చెందిన హనుమత్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు వ్యవస్థాపకుడు శ్రీ గోవిందానంద సరస్వతి స్వామీజీ ఈనెల 8న ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన జొన్నవాడలోని మల్లికార్జున సమేత శ్రీ కామాక్షితాయి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామీజీకి ఆలయ ఇ.ఓ శ్రీనివాసులురెడ్డి స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

## గిట్టుబాటు ధరల్లేక అల్లాడుతున్న రైతులు

### కిసాన్‌మోర్చా నేత సన్నపురెడ్డి ఆందోళన

జిల్లాలో రైతులు గిట్టుబాటు ధరలు లేక నానా అవస్తలు పడుతున్నారని, ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగి అన్నదాతలను ఆదుకోవాలని బిజెపి కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి కోరారు. ఈనెల 8న ఆయన నగరంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో రైతుల బాధలను వివరించారు. అనంతరం రైతులకు న్యాయం చేయాలంటూ రెండుగంటల పాటు నిరసన దీక్ష చేపట్టారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు బుజ్జిరెడ్డి, నాయకులు రాధాకృష్ణ, దాసరి ప్రసాద్, జయశంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తిదాయకం..వారి సేవాభావం

### రక్తదానం చేసిన ఇద్దరు మహిళలు

రక్తదానం చేసేందుకు నేటి అధునాతన సమాజంలో కూడా ఇంకా అనేకమంది యువకులు సంకోచిస్తున్న కాలంలో.. ఇద్దరు మహిళలు ముందుకు వచ్చి రక్తదానం చేసి తమ ఔన్నత్యాన్ని చాటుకుంటున్నారు. ఈనెల 8న నెల్లూరులోని 'మహాయాగ హెల్పింగ్ సొసైటీ' మహిళలు ఇద్దరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకుకు వచ్చి రక్తదానం చేశారు. విహారి అనే మహిళ ఇప్పటికి 10వ సారి రక్తదానం చేయగా, ప్రియాంక అనే మహిళ తొలిసారి రక్తదానం చేశారు. తలసీమియా వ్యాధితో బాధలు పడుతున్న చిన్నారుల కోసం రక్తదానం చేస్తున్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి వారిని అభినందించారు.

# రెడ్‌క్రాస్ సేవలు అపారం.. అమూల్యం

### • ఆక్సిజన్ బ్యాంకు ప్రారంభోత్సవంలో కలెక్టర్



నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ సేవలు అమూల్యమని, వరదలు, తుఫాన్ల సమయాల్లోనూ, కోవిడ్ తొలిదశ, రెండోదశల్లోనూ ప్రజలకు, బాధితులకు రెడ్‌క్రాస్ వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు కొనియాడారు. నెల్లూరులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఈనెల 9న 'రెడ్‌క్రాస్ ఆక్సిజన్ బ్యాంకు'కు జిల్లా కలెక్టర్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఐసి ఐసిఐ బ్యాంకు ఫౌండేషన్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు 40 ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్మా థెరపీ ద్వారా కరోనా రోగుల ప్రాణాలను కాపాడడంలోనూ, కరోనాతో మరణించిన వారి పార్థివదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడంలోనూ రెడ్‌క్రాస్ సంస్థ సేవలు మరువలేనివని అన్నారు. రెండోదశ కోవిడ్‌లో ఎక్కువ మంది కోవిడ్ రోగులకు ఆక్సిజన్ అందించాల్సి వచ్చిందని, అలాంటి సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవతీసుకుని జిల్లాకు ఆక్సిజన్ సరఫరా చేస్తూ ఎంతో మంది రోగుల ప్రాణాలను కాపాడారన్నారు. రాష్ట్ర మంత్రులు మేకపాటి గౌతం రెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్, జిల్లా ఎమ్మెల్యేల సహకారంతో జిల్లాలో కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్యను 47 శాతం నుంచి 6 శాతం కన్నా తక్కువకు తీసుకువచ్చామన్నారు. రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు రెండు ఆక్సిజన్ బస్సులను అందించారని, వాటి ద్వారా కోవిడ్ సెంటర్లలోని రోగులకు ఆక్సిజన్ సదుపాయం అవసరమైన సమయంలో అందించడం జరిగిందని చెప్పారు. ఇప్పుడు కూడా రెడ్‌క్రాస్ సంస్థ పేదలైన కోవిడ్ బాధితులకు ఉపయోగపడేలా ఆక్సిజన్ బ్యాంకును ఏర్పాటు చేయడం ఎంతైనా హర్షదాయకమన్నారు. అక్సిజన్ బ్యాంకుకు ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను అందించిన నాటా, ఐసిఐసిఐ, ఇతర ఎన్‌ఆర్ఐ సంస్థలను అభినందిస్తున్నానన్నారు. కరోనా మూడో వేవ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆసుపత్రుల్లో ఆక్సిజన్ బెడ్‌లు, ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు, సిలిండర్లను అందుబాటులో ఉంచుతున్నామని, జిల్లాలోని 40 పడకల ఆసుపత్రుల్లో ఆక్సిజన్ జనరేటెడ్ ప్లాంట్స్ ఏర్పాటుకు కృషిచేస్తున్నామని తెలిపారు. అనంతరం, జర్నలిస్టులకు రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా పల్స్ ఆక్సీమీటర్లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ) హరేందిరప్రసాద్, ఐసిఐసిఐ బ్యాంకు ప్రతినిధులు కె.రాజశేఖర్, శ్రీనాథ్ రెడ్డి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు సిహెచ్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## 'మూడో ముప్పు' రాకుండా
# ముందస్తు చర్యలు చేపట్టాలి

**అధికారులతో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు**

కరోనా 1, కరోనా 2 దశల్లో ఎదురైన చేదు అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని, రానున్న రోజుల్లో మరింతగా విజృంభిస్తుందని భావిస్తున్న కరోనా 3వ దశను సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం చేయాల్సిన ఏర్పాట్లన్నీ చేస్తోంది. జిల్లాలో కరోనా మూడో దశ(థర్డ్ వేవ్) ముప్పు రాకుండా వెంటనే అన్నిరకాల ముందస్తు జాగ్రత్తలను తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఈనెల 8న అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీసభ్యులు, నోడల్ అధికారులతో ఆయన సమావేశమై కరోనా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. కరోనా థర్డ్ వేవ్ చిన్నపిల్లలపై ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నందున అధికారులు దానిని నివారించేందుకు వెంటనే ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతానికి జిల్లాలో కరోనా కేసులు తగ్గుతున్నప్పటికీ, రానున్న మూడు నాలుగు నెలలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. కరోనా నిరోధానికి టీకా వేసే కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని, ఆసుపత్రుల్లో కోవిడ్ బాధితులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీలు గణేష్ కుమార్, హరేందిరప్రసాద్, బాపిరెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్, ట్రైనీ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణరాజు, జడ్పీ సిఇఓ సుశీల, డిపిఓ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

**- ఎస్ఇ ఆదిశేషయ్య**

విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్‌శాఖ ఎస్ఇ ఆదిశేషయ్య చెప్పారు. ఈనెల 7న నిర్వహించిన 'డయల్ యువర్ ఎస్ఇ' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరం నుంచి 13, గూడూరు, నెల్లూరు రూరల్, కావలి, నాయుడుపేట ప్రాంతాల నుంచి 25 సమస్యలు తన దృష్టికి వచ్చాయని, ఆ సమస్యలన్నిటినీ త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## నెల్లూరు కబుర్లు

# కొత్త జేసీ వచ్చారు

- **బాధ్యతలు చేపట్టిన విదేహ్ ఖరే**



జిల్లాకు కొత్త జేసీ(హౌసింగ్)గా విదేహ్ ఖరే నియమితులయ్యారు. ఈనెల 8న నెల్లూరు వేదాయపాలెంలోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్ళి కలెక్టర్ చక్రధర్‌బాబును గౌరవపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు కట్టించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ కార్యక్రమాన్ని నూటికి నూరుశాతం అమలుచేసేందుకు కృషిచేస్తానని అన్నారు.

# 82వ సారి రక్తదానం చేసిన అజయ్‌బాబు



రక్తదానం ప్రాణదానంతో సమానమని అందరినీ చైతన్యవంతం చేస్తున్న నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు ఈనెల 7న 82వ సారి రక్తదానం చేసి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఉపాధ్యాయునిగా ఉంటూ రక్తదాన మోటివేటర్‌గా కూడా పనిచేస్తున్న ఆయన ప్రస్తుతం బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్‌గా ఉన్నారు.

# పెద్దాసుపత్రిలో జేసీ తనిఖీలు

జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఈనెల 7న నెల్లూరు పెద్దాసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు చేశారు. కరోనా టెస్టింగ్ ల్యాబ్‌ను, రికార్డులను పరిశీలించారు. రోజుకు ఎన్ని నమూనాలు సేకరిస్తున్నారు, ఎన్ని ఫలితాలు వెల్లడిస్తున్నారోనని ఆరా తీశారు. కరోనా పరీక్షల ఫలితాలను వెంటనే వెల్లడించాలని ఈ సందర్భంగా ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.

# డాక్టర్ ప్రభాకర్‌ను సస్పెండ్ చేసిన ప్రభుత్వం

- **లైంగిక వేధింపులు నిజమేనన్న కమిటీ**

నెల్లూరు పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ ప్రభాకర్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మహిళా హౌస్‌సర్జన్‌ను డాక్టర్ ప్రభాకర్ లైంగికంగా వేధించడం వాస్తవమేనని ప్రభుత్వం నియమించిన కమిటీ, కలెక్టర్ నియమించిన త్రిసభ్య కమిటీలు నిర్ధారించడంతో ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. డాక్టర్ ప్రభాకర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చిన వెంటనే తొలుత ఆయన్ను కర్నూలు జిల్లాకు బదిలీచేసి ఆరోపణలపై దర్యాప్తు ప్రారంభించారు. ఆ ఆరోపణలు నిజమని తేలడంతో డాక్టర్ ప్రభాకర్‌ను సస్పెండ్ చేయడమే కాకుండా, పూర్తిస్థాయి విచారణ జరిగేవరకు నెల్లూరును విడిచి వెళ్లకూడదంటూ ప్రభుత్వం జారీచేసిన ఆదేశాల్లో పేర్కొంది.

# ఇకనైనా బుద్ధిగా మెలగండి

**- రౌడీషీటర్లకు సిఐ హితవు**

రౌడీషీటర్లు ఇకనైనా తమ జీవన విధానాన్ని మార్చుకుని సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని, లేకుంటే కఠినచర్యలు తప్పవని నెల్లూరులోని నవాబుపేట సిఐ టివి సుబ్బారావు హితవు చెప్పారు. ఈనెల 6న ఆయన రౌడీషీటర్లు, అనుమానితులకు పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రతిఒక్కరిపై నిఘా ఉంటుందని, ఎలాంటి గొడవలకు అరాచకాలకు దిగకుండా రౌడీషీటర్లు బుద్ధిగా ఉంటూ గౌరవప్రదంగా బతకాలని, కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రమేష్‌బాబు, శివప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.




## పొదలకూరు సిహెచ్‌సికి 'కాయకల్ప' అవార్డు

జిల్లాలోని పొదలకూరు సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యసేవలందించడంలో జిల్లాలోనే మొదటిస్థానంలో ఉంటూ 'కాయకల్ప' అవార్డును సాధించింది. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో ఈ ఆసుపత్రిలో వైద్యసేవలు బాగా మెరుగయ్యాయి. రోగులకు మెరుగైన చికిత్సలందించడంలోనూ, పారిశుద్ధ్యం, స్వచ్ఛత ప్రమాణాల ప్రాతిపదికన ఈ ఆసుపత్రికి విశిష్టమైన స్థానం లభించింది. కరోనా నేపథ్యంలో ఈ ఆసుపత్రిని కోవిడ్ సెంటర్‌గా మార్చడంతో పాటు ఎమ్మెల్యే కాకాణి 10 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, 25 పల్స్ ఆక్సీమీటర్లు, 3 ఆక్సిజన్ సిలిండర్లను అందజేయడంతో ఆసుపత్రి సేవలు మెరుగయ్యాయని ఆసుపత్రివర్గాలు పేర్కొన్నాయి.

## మలేరియా నిర్మూలనే లక్ష్యం

మలేరియా వ్యాధిని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో అందరూ కలసి పని చేయాలని మనుబోలు మండల వైద్యాధికారి డాక్టర్ వెంకటకిషోర్ అన్నారు. ఈ నెల 5న మండల ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం పరిధిలోని సిబ్బందితో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో మలేరియా లక్షణాలున్న వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. జూన్ నెల మలేరియా వ్యతిరేక మాసంగా నిర్వహించాలని వైద్యఆరోగ్య సిబ్బంది ఈ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధి నివారణకు మరింత శ్రద్ధతో పనిచేయాలని సూచించారు.

# శీతల శవపేటికల వితరణ

- చేజర్ల దాతల ఔదార్యం



మండలంలో ఎవరైనా చనిపోతే వారి మృత దేహాలను బంధువులు వచ్చేంతవరకు భద్రపరచుకునేందుకు అవసరమైన శీతల శవపేటికలు (బాడీ ఫ్రీజర్లు) లేకపోవడంతో చేజర్ల మండలంలోని ప్రజలు బాగా ఇబ్బందిపడుతున్న విషయాన్ని గమనించిన దాతలు కొందరు వాటిని వితరణగా అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఫ్రీజర్లు కావాలంటే మండల ప్రజలు నెల్లూరుకు వెళ్ళాల్సివచ్చేది. ఒక్కోసారి అవి అందుబాటులో ఉండేవి కావు. దీంతో దాతలు పల్లాపు పెంచలరెడ్డి, విజయలక్ష్మి దాదాపు 75 వేల రూపాయల విలువజేసే ఫ్రీజర్‌ను, చేజర్లకు చెందిన దేశిరెడ్డి విమల, చేరెడ్డి సావిత్రమ్మలు కూడా మరో 75 వేల రూపాయల విలువజేసే మరొక ఫ్రీజర్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఈనెల 5న జరిగిన కార్యక్రమంలో చేజర్ల మండల వైకాపా కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్రీజర్లు లేని పరిస్థితిని దాతల దృష్టికి తీసుకురావడంతో వారు ఈ ఫ్రీజర్లను అందజేశారని దాతలను అభినందించారు. ఈ ఫ్రీజర్లను చేజర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉంచుతామని, కావాల్సినవారు వినియోగించుకోవచ్చని రెడ్‌క్రాస్ ఛైర్మన్ పెంచలపుల్లయ్య తెలిపారు. చేజర్ల తహశీల్దార్ శ్యామసుందర రాజు, పిహెచ్‌సి వైద్యులు ఎం.ప్రమీలారాజకుమారి, మొహతాబ్, సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ పుల్లయ్య, నాయకులు తూమాటి వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# ఇసుక రీచ్‌ల సిబ్బంది తొలగింపు అన్యాయం

- సిఐటియు ధర్నాందోళన

జిల్లాలోని ఇసుక రీచ్‌లలో అవుట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న 150 మంది ఉద్యోగులను తొలగించడం అన్యాయమని, వారిని తిరిగి కొనసాగించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు టివివి ప్రసాద్ కోరారు. ఈనెల 5న నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఈ విషయమై ధర్నాందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కొత్త ఇసుక విధానంతో ఇసుకరీచ్‌లను కంపెనీలకు అప్పగించడంతో వారు ఇతర రాష్ట్రాల వారిని పనులకు నియ మించుకుంటున్నారని, దీంతో ఇప్పటిదాకా పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించడం దారుణమని అన్నారు. పాతవారిని ఉద్యోగాల్లో నియమించి వారికి న్యాయం చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకుడు మీరావలీ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

### జయభారత్ ఆసుపత్రికి..

# 'సేవా ఇంటర్నేషనల్' సంస్థ సాయం

- 18 లక్షల విలువైన ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ల వితరణ



నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రికి సేవా ఇంటర్నేషనల్ సంస్థ వారు ఇటీవల 18 లక్షల రూపాయల విలువచేసే 27 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను వితరణగా అందజేసి తమ సేవా భావం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆ సేవాసంస్థ ఉపాధ్యక్షుడు బాలు సుబ్బారావు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్, డెప్యూటీ జనరల్ మేనేజర్ మనోహర్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యారోగ్య సిబ్బందికి..మాస్కులు పంపిణీ

ఈ కరోనా కష్టకాలంలో విధులు నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది కోసం నెల్లూరులోని ఏపి ఎన్జీఓల సంఘం జిల్లాశాఖ నాయకులు ఇటీవల మాస్కులు, గ్లౌజులు పంపిణీ చేశారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి రాజ్యలక్ష్మి చేతుల మీదుగా వాటిని తమ వితరణగా అందించారు. అసోసియేషన్ కార్యదర్శి ఆంజనేయవర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫార్మసీ సూపర్‌వైజర్ రాధాకుమారి, అసోసియేసన్ జిల్లా శాఖ అధ్యక్షుడు గిరిధర్, ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, రాజేంద్ర ప్రసాద్, రామకృష్ణారెడ్డి, శ్యాంసన్‌బాబు, పెంచలరావు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి 3 లక్షల విరాళం

నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి కర్నూలుకు చెందిన ప్రముఖ చిన్నపిల్లల డాక్టర్ వరప్రసాద్, అజిత దంపతులు 3 లక్షల రూపాయలు విరాళం ప్రకటించారు. అజిత సోదరుడు, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు ఇటీవల ఆ విరాళం చెక్కును రెడ్‌క్రాస్ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. డాక్టర్ వరప్రసాద్ తన తల్లిదండ్రులు మౌలయ్య, జయలక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఆ విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు ఎల్‌వి నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## కరోనా కట్టడికి..
# ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలి

**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు**

కరోనా కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా కేరళలో గ్రామగ్రామానా ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటుచేసి కరోనాను నియంత్రించినట్లుగానే మన రాష్ట్రంలోనూ ఆ ఏర్పాట్లు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పెనుబల్లి మధు సూచించారు. ఈనెల 6న ఆయన నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో సిపిఎంపార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కరోనా బాధితుల ఐసోలేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటిదాకా సుమారు 17కోట్ల మందికే వ్యాక్సినేషన్ వేశారని, 80కోట్ల మందికి పైగానే వ్యాక్సిన్ వేయాల్సి ఉందని, అందుకు కనీసం మరో రెండేళ్ళు దాకా పడుతుందని అంటూ రాష్ట్రంలో అందరికీ టీకా వేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మూలం రమేష్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వెన్నెలకంటి రాఘవయ్య సేవలు అపూర్వం

- సంక్షేమసంఘం నాయకుల నివాళి

బడుగు, బలహీనవర్గాల ప్రజల చైతన్యజ్యోతి, యానాదులు, గిరిజనుల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయుడు..పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య సేవలు అపూర్వమంటూ ఆ సంఘం నాయకులు కొనియాడారు. వెన్నెలకంటి రాఘవయ్య 124వ జయంతి సందర్భంగా ఇటీవల నెల్లూరులోని బోసుబొమ్మ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐటిడిఏ పి.ఓ పులి చెంచయ్య, లక్ష్మీప్రసాద్, శ్రీనివాసులు, సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసి పెంచలయ్య ఆధ్వర్యంలో సుబేదారుపేటలో ఉన్న వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని వెన్నెలకంటికి ఘనంగా నివాళులర్పించారు. వెన్నెలకంటి జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఈ సందర్భంగా కోరారు. యానాదుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బిఎల్ శేఖర్, ప్రధాన కార్యదర్శి రాపూరు కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇండ్ల రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తలపల చంద్రమౌళి, చేవూరు సుబ్బారావు, బూదూరు కేశవరామ్, మురళి, యల్లంపల్లి రమేష్ పాల్గొన్నారు.

# నలుగుర్ని మింగేసిన చెరువు

- మృతుల్లో ముగ్గురు చిన్నారులు
- రాజుపాళెంలో తీరని విషాదం

*విధి వికటిస్తే పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో ఊహించలేం. ఎవరు ఎప్పుడు ఏమవుతారో.. ఏ నిమిషానికి ఏమి జరుగుతుందో చెప్పలేం. అలాంటి దుర్ఘటనే ఈనెల7న ఓజిలి మండలంలోని రాజుపాళెం గ్రామంలో జరిగింది. గుడ్డలు ఉతుక్కునేందుకు వెళ్లిన ఒక వ్యక్తితో పాటు సరదాగా చెరువులోకి దిగిన ముగ్గురు పిల్లలూ నీళ్ళలో మునిగిపోయి ప్రాణాలు కోల్పోవడం ఎంత దారుణం! వాళ్లను రక్షించేందుకు ప్రయత్నించిన ఆ వ్యక్తి కూడా దుర్మరణం చెందడం ఎంత ఘోరం!..వీరందరి మృతితో వారి కుటుంబాల రోదన హృదయవిదారకంగా ఉంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.*





రాజుపాళెం గ్రామంలోని ఇళత్తూరు చరణ్‌తేజ(10), జాహ్నవి(12), మాచవరం హేమంత్(10) వీరు ముగ్గురూ మంచి స్నేహితులు. సోమవారం సాయంత్రం వీరంతా వీధిలో ఆడుకుంటుండగా ఖలీల్ అనే వ్యక్తి(30) గుడ్డలు ఉతుక్కునేందుకు చెరువు వద్దకు వెళ్తుండడం చూసి ఈ చిన్నారులు కూడా వెళ్ళారు. ఖలీల్ గుడ్డలు ఉతుక్కుంటుండగా సరదాగా చెరువులో ఈత కొడదామనుకుని ఆ చిన్నారులు ముగ్గురూ ఒకరివెంట ఒకరుగా చెరువులోకి దిగారు. అయితే అక్కడ గ్రావెల్ గుంతలు లోతుగా ఉండడంతో ఆ గుంతల్లో పడి అందరూ మునిగిపోయారు. వాళ్ళని రక్షించాలనే ఆదుర్దాతో ఖలీల్ గబగబా చెరువులో లోతున్న ప్రాంతానికి వెళ్ళి తాను కూడా మునిగిపోయి క్షణాల్లో ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాదంతో రాజుపాళెం ఊరు ఊరంతా తల్లడిల్లిపోయింది. ఆ ముగ్గురు చిన్నారుల తల్లిదండ్రులంతా పేదలు, చిరువ్యాపారులే. ఇప్పటిదాకా ఆడుకుంటున్న బిడ్డలు చెరువులో పడి మృతిచెందడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు వర్ణనాతీతం. వీరితోపాటు ఖలీల్ కూడా చనిపోవడంతో ఆయన భార్య, ఇద్దరు బిడ్డల వేదన అంతా ఇంతా కాదు. ఖలీల్ మృతితో వారి కుటుంబం పరిస్థితి మరింత దయనీయంగా మారింది. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు హుటాహుటిన వచ్చి సంఘటన ప్రాంతాన్ని సందర్శించారు. గూడూరు డిఎస్పీ రాజ గోపాల్‌రెడ్డి, వాకాడు సిఐ నరసింహారావు, ఎస్‌ఐ శేఖర్‌బాబు ఈ విషాద ఘటనకు సంబంధించి వివరాలను ఆరాతీశారు.

## చెల్లిని, తమ్ముడిని కోల్పోయిన..
# చిన్నారిని ఓదార్చిన ఎమ్మెల్యే సంజీవయ్య



చెరువులో పడి మృతిచెందిన ముగ్గురు చిన్నారుల కుటుంబాలను సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఈ నెల 8న పరామర్శించారు. గ్రామప్రజలతో, పోలీసులతో మాట్లాడి సంఘటన ఎలా జరిగిందంటూ ఆరాతీశారు. ఈ దుర్ఘటనలో చెల్లెలిని, తమ్ముడిని కోల్పోయిన ఒక చిన్నారిని ఓదార్చి ఆ బాలికకు ధైర్యం చెప్పారు. చెరువులో గుంతలు తవ్వడంతో ప్రమాదకరంగా మారిన విషయం తెలుసుకుని, వెంటనే ఆ గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట వైకాపా నాయకులు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ కొండూరు ప్రభాకర్‌రాజు, వాకాడు సిఐ నరసింహారావు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.




### రాష్ట్రవ్యాప్తంగా
# 50వేల పంచాయతీరాజ్ భవనాలు


పంచాయతీరాజ్ ఇంజనీర్లతో సమీక్ష జరుపుతున్న సిఇ సుబ్బారెడ్డి

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రవ్యాప్తంగా 50వేల భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయని పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ సుబ్బారెడ్డి చెప్పారు. ఈనెల 5న ఆయన నెల్లూరులోని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఇ కార్యాలయంలో ఇంజనీర్లతో సమావేశమై అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో 4వేల పంచాయతీరాజ్ భవనాల నిర్మాణం జరిగిందని, ఇప్పుడు ఏకంగా రికార్డు స్థాయిలో 50వేల భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాల భవనాలు, హెల్త్‌క్లినిక్‌లు, అంగన్‌వాడీ భవనాలు, మిల్క్ యూనిట్ల నిర్మాణాలు కూడా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయన్నారు. భవనాల నిర్మాణాల్లో నాణ్యతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీరాజ్ ఇన్‌చార్జ్ ఎస్ఇ శ్రీనివాసులురెడ్డి, ఏఇలు, డిఇలు పాల్గొన్నారు.

# ఎండల్లో వర్షం.. రైతుల్లో హర్షం

## జిల్లాకు ముందుగానే నైరుతి రుతుపవనాలు

మండు వేసవిలో అల్లాడిపోతున్న జనానికి కాస్తంత ఊరట కలిగింది. నైరుతి పవనాలు జిల్లాను తాకడంతో జిల్లాలో చల్లని వాతావరణం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఎండవేడిమి నుంచి, ఉక్క పోత నుంచి ఉపశమనం పొందారు. ఇటీవల పలు మండలాల్లో ఒకమోస్తరు నుంచి భారీ వానలు కురిశాయి. నెల్లూరు నగరంలోనూ పలుచోట్ల వాన కురిసింది. గూడూరు, వెంకటాచలం, బుచ్చి, కొడవలూరు, విడవలూరు, ఆత్మకూరుల్లో ఒకమోస్తరు వానలు కురిశాయి. ఏదేమైనా రోహిణి కార్తె ఎండలు మండుతుండగానే, నైరుతి రుతుపవనాలు కాస్తంత ముందుగానే జిల్లాకు రావడంతో ప్రజలు, ప్రత్యేకించి రైతులు సంతోషపడుతున్నారు.

### సిఐడి విభాగంలో..
# ముగ్గురు ఇన్స్‌పెక్టర్లు

నెల్లూరులోని సిఐడి విభాగంలో ముగ్గురు ఇన్స్‌పెక్టర్లను నియమిస్తూ సిఐడి అడిషనల్ డిజిపి పివి సునీల్‌కుమార్ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. ఎం.బాబి, బి. నాగభూషణం, ఎ.సుధాకర్‌లను ఇన్స్‌పెక్టర్లుగా నియమించి, సిఐడి శాఖలోని పలు విభాగాల్లో కేటాయించిన విధులను వారు నిర్వహించేలా ఉత్తర్వులిచ్చారు.

### కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులకు
# న్యాయం చేయండి

గత ఇరవై ఏళ్ళుగా కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా నియమించి న్యాయం చేయాలని హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 6న నెల్లూరులో విలేకరులతో మాట్లాడుతూ తమను ప్రభుత్వం రెగ్యులర్ చేస్తుందని హెల్త్ అసిస్టెంట్లు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. కోవిడ్ విధుల్లో ఉండగా కరోనా బారిన పడినవారి వైద్యానికయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించడానికి నిర్ణయించడం ఎంతైనా హర్షదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శివరామకృష్ణ, ఎంఎన్ఓ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# పశుసంవర్ధక శాఖకు కొత్త జేడీ

జిల్లా పశుసంవర్ధక శాఖ కొత్త జాయింట్ డైరెక్టర్‌గా ప్రకాశం జిల్లా మార్కాపురం డెప్యూటి డైరెక్టర్ మహేశ్వరుడును నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చింది. ఈ స్థానంలో పనిచేస్తున్న విజయమోహన్ గత ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చేయగా డి.డి వెంకటస్వామిరెడ్డి ఇప్పటిదాకా ఇన్‌చార్జిజేడీగా ఉన్నారు. ఆయన కూడా సెలవుపై వెళ్ళడంతో కోవూరు డిడి కోటేశ్వరరావుకు ఇన్‌చార్జి జేడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో రెగ్యులర్ జేడీగా మహేశ్వరుడు నియమితులయ్యారు.

## చింతలదీవి జేడీగా లావణ్యలక్ష్మి :

అదేవిధంగా జిల్లాలోని చింతలదీవి జాతీయ కామధేను బ్రీడింగ్ సెంటర్‌కు జేడీగా డాక్టర్ ఎస్.లావణ్యలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కర్నూలులో డిడిగా పనిచేస్తున్న ఆమెకు పదోన్నతినిచ్చి జేడీగా నియమించారు.

# పెట్రోలు, డీజల్ ధరల పెంపు దారుణం

**• సిపిఎం నిరసన**

కేంద్రప్రభుత్వం పెట్రోలు, డీజల్ ధరలను తగ్గించకపోవడం దారుణమని, ఈ ధరల ప్రభావం వల్ల నిత్యావసర సరుకుల ధరలు కూడా పెరిగి సామాన్యుల బతుకు కష్టసాధ్యమవుతోందని, వెంటనే ధరలను నియంత్రించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 6న నెల్లూరులోని అయ్యప్పగుడి సెంటర్‌లోని పెట్రోల్‌బంకు వద్ద వారు ఆందోళన చేశారు. పెట్రోలు, డీజల్‌ను జిఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, వాటిపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన పన్నులను తగ్గించాలని వారు కోరారు. ఈ ఆందోళనలో సిపిం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, సంపత్‌కుమార్, కాలేషా, సుధాకర్, రవికుమార్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు 'లయన్స్' చేయూత

లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆద్వర్యంలో ఈనెల 6న నగరంలోని ప్రకాష్‌నగర్ వినాయకుడి గుడి వద్దనున్న పేదలకు నిత్యావసరుకులు అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు రామసుబ్బయ్య 50వేల రూపాయల విలువచేసే సరుకులను వారికి పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రామానుజం, కృష్ణమోహన్, ఎడ్యుకేషన్ కమిటీ ఛైర్మెన్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొని, కరోనా నేపథ్యంలో ఉపాధి లేక అవస్తలుపడుతున్న 130 మంది పేదలకు సాయం అందించిన రామసుబ్బయ్య-నాగమణి దంపతులను అభినందించారు.



# ఓటు కోసం.. టీకా పోటు

ఎన్నో ఆశలు పెట్టుకున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు... బీజేపీకి గూబ గుయ్‌మనిపించాయి. మమతా బెనర్జీ దెబ్బకు కళ్ళు బైర్లు కమ్మాయి. బీజేపీ సర్వశక్తియుక్తులూ బెంగాల్‌పై కేంద్రీకరించింది. మోదీ, అమిత్‌షా ప్రచారానికి వీలుగా 8 దశల్లో పోలింగ్‌కు ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది. ఒక పక్క కోవిడ్–19 రెండో దశ దేశంలో విలయతాండవం చేస్తున్నప్పటికీ, మోదీ, షా భారీ బహిరంగ సభలు నిర్వహించారు. 272 స్థానాలకు 200 స్థానాల్లో విజయం తమదేనని షా ముందుగానే ప్రకటించారు. 'ఏం పాపం..! ఆ డెబ్భై రెండూ వదిలేశారు..!?' అంటూ మమతా బెనర్జీ ఎకసెక్కాలు కూడా ఆడారు. తీరా.. ఎన్నికల ఫలితాలతో బీజేపీ నేతలు షాక్ తిన్నారు. తృణమూల్‌కు గతంలో ఎప్పుడూ లేనంతగా 211 స్థానాలు వచ్చాయి. అంటే.. 2024 లోకసభ ఎన్నికల నాటికి బెంగాల్‌లో మమతే ముఖ్యమంత్రిగా ఉంటారు అనే మాట తలుచుకోగానే, బీజేపీ నేతలు కలవరానికి లోనవుతున్నారు. బెంగాల్‌లో 42 లోకసభ స్థానాలు ఉన్నాయి.

ఇక, ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ పరిస్థితి ఆ పార్టీ కేంద్ర నాయకులకు మరింత అందోళనకరంగా తయారైంది. కోవిడ్–19 మొదటి దశ, రెండో దశ కూడా ఉత్తరప్రదేశ్‌ను బండకేసి ఉతికింది. ఇంకా ఉతుకుతూనే ఉంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగాయి. ఓటర్లు కర్రు కాల్చి వాతలు పెట్టారు. దీనితో బీజేపీ కేంద్ర నాయకత్వానికి కళ్ళు అంటుకున్నాయి. కోవిడ్–19 ఉత్తరప్రదేశ్‌ను ఓ పెద్ద శవంగా మార్చేసి, గంగానదిలో విసిరేసిందని కాదు. అక్కడ పరిస్థితి అలాగ తయారైతే.., 2024లో లోకసభ ఎన్నికల్లో గెలవడం ఎలాగా అన్న బెంగతో బీజేపీ పెద్దలు కుదేలైపోయారు. ఆర్ఎస్ఎస్ పెద్దలు కూడా మేల్కొన్నారు. దిద్దుబాటు చర్యలు మొదలుపెట్టారు. యూపీ పాత సీసాలో కొత్త సారాయి పోసే పనికి శ్రీకారం చుట్టారు. అంటే... ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మీద ఈగ కూడా వాలకుండా ఆర్ఎస్ఎస్ కాపు కాసింది. కావాలంటే మంత్రుల్ని మార్చుకోమంది.

ఈ చర్యలు సరిపోవేమో అని బీజేపీ కేంద్ర నాయకత్వానికి డౌటు వచ్చిందేమో తెలియదు. ఎక్కడ పోగొట్టుకున్నామో... అక్కడే వెదుక్కోవాలని డిసైడ్ అయ్యారు.

కోవిడ్–19 రెండో దశను నియంత్రించడంలో విఫలమయ్యారు. ఎందుకంటే– బెంగాల్ ఎన్నికల్లో నిమగ్నమయ్యారు. ఏమాత్రం ముందుచూపు, సన్నద్ధత లేకుండా వ్యవహరించారనే తీవ్ర విమర్శలను మోదీ మూట గట్టుకున్నారు. విదేశీ మీడియా అయితే...కేంద్రాన్ని, మోదీని ఉతికి ఆరేసింది. మోదీ ప్రతిష్ట దేశంలో బాగా దెబ్బ తిన్నదనడంలో– మరో అభిప్రాయానికి తావు లేకుండా పోయింది. కళ్ళు మూస్తే 2024 ఎన్నికలు... కళ్ళు తెరిస్తే 2024 ఎన్నికలే కళ్ళ ముందు మెదులుతున్నాయి.

ఇప్పుడు దిద్దుబాటు చర్యల్లో భాగంగా దేశంలో 18 ఏళ్ళు పైబడిన వారందరికీ కేంద్రమే ఉచితంగా టీకా సరఫరా చేస్తుందని ప్రధాని ఇప్పుడు తాజాగా ప్రకటించారు. ఆ ముక్క జనవరిలోనో.. ఫిబ్రవరిలోనో చెప్పి ఉండాల్సింది. ఈ 'ఉచిత టీకా పథకం' ప్రకటించడానికి ముందు సగం కేంద్రం కొంటుందని, మిగిలిన సగం రాష్ట్రాలు కొనుక్కోవాలని, అందులో సగం ప్రైవేటు' హాస్పిటల్స్ కు అమ్ముకోవచ్చని... ఇదని, అదని... రోజుకో ప్రకటన వెలువడింది..., ఢిల్లీ నుంచి. దొరికిందే ఛాన్స్ అన్నట్టుగా ప్రైవేట్‌కు డోస్‌కు 1200, కేంద్రానికి 150, రాష్ట్రాలకు 300 అంటూ హైదరాబాద్‌లోని భారత్ బయోటెక్... తన దేశభక్తిని చాటుకుంది.




ప్రైవేట్ వాళ్ళు 1500 నుంచి 2000 వరకు కుమ్మి వదులుతున్నారు. రాష్ట్రాలు ఇప్పటికే ఈ టీకాల మీద చాలా డబ్బులు ఖర్చు చేశాయి. గ్లోబల్ టెండర్లు పిలిస్తే...' కేంద్రానికి అయితే ఇస్తాం గానీ... రాష్ట్రాలకు ఇవ్వం పొమ్మన్నాయి. దీనితో, రాష్ట్రాలు దిక్కు తోచని స్థితిలో పడ్డాయి. వాక్సినేషన్ దేశంలో బాగా మందగించింది.

ఇప్పుడు, దేశమంతా ఫ్రీ అంటూ ప్రధాని ప్రకటించడం ఏమిటి అంటూ ప్రతిపక్షాలు విరుచుకు పడుతున్నాయి.

దీని అమలు అంత తేలిక కాదు. మన దేశ జనాభా 137 కోట్లకు పైమాటే. అంటే... కుడీ ఎడంగా మూడు వందల కోట్ల డోసులు కావాలి. గ్రామీణులు, నిరక్షరాస్యులు అత్యధికంగా గల మనదేశంలో అందరికీ టీకాలు రెండుసార్లు వేయడం అంటే... అదో భగీరథ ప్రయత్నమే. ఈలోపు 3వ దశ తగులుకుంటుందని అంటున్నారు. దాని సన్నద్ధత ఏమిటో తెలియదు. ఇవన్నీ ఒక కొలిక్కి వచ్చేసరికి 2022 వచ్చేస్తుంది. అది వస్తూనే ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికలను వెంటబెట్టుకు వస్తుంది. షెడ్యూల్ ఈ ఏడాది చివరికే వచ్చేస్తుంది. అక్కడ తేడా కొడితే...దాని ప్రభావం వచ్చే ఏడాది చివరిలో జరగనున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలపై పడుతుంది. కిందటిసారే... అష్టకష్టాలు పడి... అక్కడ బీజేపీ గెలిచింది. మళ్లీ 2023లో కర్ణాటక, మధ్య ప్రదేశ్ ఎన్నికలు ఉన్నాయి. కర్ణాటక, మధ్యప్రదేశ్– బీజేపీ పాలిత రాష్ట్రాలు. 2024 మొదట్లో లోకసభ ఎన్నికలే కదా! ఇలా... వరుస ఎన్నికలు బీజేపీ కేంద్ర నాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేయబోతున్నాయనడంలో సందేహం లేదు.

అయితే, బీజేపీకి ప్లస్ పాయింట్లు కూడా ఉన్నాయి. బీజేపీ ప్రతిష్ట కొంత దెబ్బతిన్నప్పటికీ ఆయనకు వ్యతిరేకంగా స్థిరమైన ప్రత్యామ్నాయం కనుచూపు మేరలో కనిపించడం లేదు. బెంగాల్‌లో మమత, బీహార్‌లో లాలూప్రసాద్‌యాదవ్, తమిళనాడులో స్టాలిన్, మహారాష్ట్రలో శరద్ పవార్, కేరళ లో సీపీఎం, యూపీలో అఖిలేష్‌యాదవ్, ఆంధ్రలో జగన్, తెలంగాణలో కేసీఆర్... ఇలా పలువురు ప్రాంతీయ నేతలు ఎక్కువ సీట్లు సాధించినప్పటికీ... వీరందరూ ఒక్కమాటపై మోదీకి వ్యతిరేకంగా నిలకడైన జత కట్టే అవకాశం లేదు. ఎవరి రాజకీయ అవసరాలు వారికి ఉంటాయి. కనుక, మూడవసారి కూడా మోదీయే ప్రధానిగా బాధ్యతలు స్వీకరించడం తథ్యం. లోకసభలో మెజారిటీ పదో, పరకో తగ్గినా మద్దతు ఇచ్చే ప్రాంతీయ పార్టీలు ఉంటాయి.

కాకపోతే, రాజ్యసభలో కూడా మెజారిటీ సాధించాలనే బీజేపీ కోరిక నెరవేరక పోవచ్చు. ఎందుకంటే 2024 లోకసభ ఎన్నికలు పూర్తయ్యే నాటికి, చాలా రాష్ట్రాల శాసనసభలు ప్రాంతీయ పార్టీల చేతుల్లో ఉంటాయి. అందువల్ల రాజ్యసభలో వాటి బలం పెరుగుతుంది.

అయితే... ఈ కోవిడ్–19 అనేది బీజేపీకి చాలా పాఠాలు నేర్పినట్టే కనపడుతున్నది. కేవలం మాటలు కాకుండా... వళ్ళు వంచి చాకిరికి మళ్ళాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది. కాస్తంత వినయం నేర్పింది. కష్టపడి పనిచేయకపోతే... 2024 ఉంది జాగ్రత్త అని హెచ్చరిక జారీ చేసింది. ముందు ముందు... దేశంపై మరిన్ని పథకాల మాయ వలలను కేంద్రం విసరవచ్చు కూడా.

చూద్దాం...ఏ వలలు విసురుతారో!



భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com



## ప్రభుత్వ ఆసుపత్రికి
# ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం దాతృత్వం

### 50 ఆక్సిజన్ సిలిండర్లు అందించిన డాక్టర్ సి.ఆర్.రెడ్డి




కరోనా విపత్కర సమయంలో బాధితులకు అండగా దాతలు నిలవడం అభినందనీయమని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. గూడూరు పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసుపత్రి, సిఆర్ నెట్‌వర్క్, సిఆర్ మార్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణిల దాతృత్వంతో ఇటీవల 50 ఆక్సిజన్ సిలిండర్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యం స్వలాభంతో కాకుండా పేదలను ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రాంతీయ వైద్యశాలకు సిలిండర్లు అందజేయడం, ఉచిత వైద్య శిబిరాల ద్వారా ఎంతోమందికి వైద్యసేవలను అందించడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు రాజా, ప్రతినిధులు వాసిలి ప్రవీణ్, హరీష్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# ప్రాణవాయువును అందిస్తున్న పీఎస్సార్ ట్రస్ట్



పీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, వైసీపీ నేత శివకుమార్‌రెడ్డి మరోసారి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. గూడూరు పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో ఏర్పాటైన కోవిడ్ వార్డుకు వారు ఇప్పటికే అనేక విధాలుగా చేయూత అందించారు. వైద్య పరికరాలు, కోవిడ్ కిట్ మందులు, ఆక్సిజన్ సిలిండర్లు వంటి వాటిని విడతలవారీగా అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఈ క్రమంలో భాగంగా ఈ నెల 5న పీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 ఆక్సిజన్ సిలిండర్‌లను వైసిపి నాయకులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల దేవసేనమ్మ, శివకుమార్‌రెడ్డి 50 ఆక్సిజన్ సిలిండర్లను అందచేశారని, తాజాగా 50 ఆక్సిజన్ సిలిండర్‌లు అవసరమని అడిగిన వెంటనే వారు స్పందించారన్నారు. ఏ అవసరమొచ్చిన తమవంతు సహకారం అందిస్తామని వారు చెప్పారన్నారు. నర్సు గౌరీ, వైసీపీ నాయకులు కోడిపర్తి శ్రీధర్, గోపాల్‌యాదవ్, ముని, సాయి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# కనుమూరు సేవలకు డీజీపీ ప్రశంసలు



కరోనా సెకండ్ వేవ్ విజృంభించడంతో ఎంతో మంది కరోనా బారినపడి ఆక్సిజన్ లేక ప్రాణాలు విడిచే పరిస్థితి నెలకొంది. దీంతో కనుమూరు హరిచంద్రారెడ్డి వెంటనే స్పందించి గూడూరు ఏరియా ఆసుపత్రి, కోట, చిల్లకూరు కేంద్రాలలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులకు 200కుపైగా ఆక్సిజన్ సిలిండర్లు అందజేయడమేకాక మళ్లీ రీఫిల్ చేసి అందించే మహత్తరమైన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరంతర ప్రజా సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర డిజిపి గౌతమ్ సవాంగ్ నెల్లూరుజిల్లాలో నిస్వార్థంగా సేవలు చేసే సంస్థలను గుర్తించారు. అందులో గూడూరు పట్టణానికి చెందిన కనుమూరు హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఉండడం కనుమూరు సేవాభావానికి నిదర్శనం.



ట్రస్టు ప్రతినిధి అనిల్‌ను సన్మానిస్తున్న ఎస్పీ భాస్కర్‌భూషణ్

# పాత బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీ



గూడూరు పాత బస్టాండ్‌లోని దుకాణాలలో నిషేధిత గుట్కా, హన్స్ ప్యాకెట్లు అక్రమంగా అమ్ముతున్నారని సమాచారం రావడంతో గూడూరు వన్‌టౌన్ ఎస్సై బ్రహ్మనాయుడు, దుకాణాలలో పరిశీలించారు. దుకాణ యజమానులకు గుట్కా, హన్స్ ప్యాకెట్లు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది మస్తానయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.



గూడూరు శ్రీరామరక్ష కుటీరంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని విశేష పూజలు, సిందూర, తమలపాకుల అలంకారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పవన్ దంపతులు, సభ్యులు పాల్గొన్నారు.







కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక

40 లాయర్ YEARS

పాఠకుల చేతిలో అక్షర దీపిక
నెల్లూరీయుల ప్రియపుత్రిక


లాయర్
వారపత్రికకు
40వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



నలుబోలు బలరామయ్యనాయుడు
ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ చైర్మెన్ - నెల్లూరు
వాకర్స్ ఇంటర్నేషనల్ 203 డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరి



వీరిశెట్టి హాజరత్‌బాబు
పికినిక్ ఐస్‌క్రీమ్స్,
మురళీకృష్ణ 70, నెల్లూరు.



# నిత్య స్మరణీయుడు.. .. మన రాజగోపాలుడు

'లాయర్' 40 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా...

రాజగోపాలుడు
పాత్రికేయతను
కొత్త పుంతలు తొక్కించి
కొత్త చరిత్రకు శ్రీకారం
చుట్టిన అక్షర సైనికుడు

నెల్లూరుగడ్డపై నిల్చొని చరిత్రపుటలపై
చెరగని సంతకం చేసిన
పాత్రికేయ ప్రభాకరుడు

జనహృదయాల్ని జెండాగా
ఎగురవేసి
జనం అడుగుల్లో వసంతాలు
మొలిపించడానికి
జనం పిడికిళ్ళలో సూర్యోదయాలు
ప్రభవించడానికి
కలం పట్టిన దీక్షాదక్షుడు

నెల్లూరు పెన్న నీటి పౌరుషత్వంతో
క్రోధాగ్నులు పుక్కిలించే
జనం పక్షాన నిలచి,
ఎదురొడ్డి గెలిచిన చరితార్థుడు
మన రాజగోపాలుడు

కస్తూరిదేవి విద్యాలయం పాలిట
జ్ఞాననేత్రమై... విద్యాసుగంధమై
అవతరించిన మేరునగధీరుడు

సారా వ్యతిరేక ఉద్యమాన్ని
తన కలం శరంతో
ముందుకు నడిపించిన
పోరాటయోధుడు.

వెన్నెల జెండా పుచ్చుకొని
పెనుచీకట్ల ప్రళయాల్ని పారద్రోలి
అక్షర జ్యోతులు వెలిగించిన
కలం యోధుడు

ప్రజారోగ్య ప్రాంగణాన్ని
పరులపాలు కానీయకుండా
అమెరికన్ ఆస్పత్రి ఆస్తులకు
పహారా కాసిన జాగృత ధురీణుడు

కల్లబొల్లి ఫైనాన్సు కంపెనీలు
కొంపలు ముంచుతుంటే
తన కలాన్ని అడ్డుపెట్టి
వారి బలాన్ని తిప్పికొట్టిన
జన రక్షకుడు రాజగోపాలుడు

తన సంపాదకత్వంలో
సాహితీ సుగంధాలు వెదజల్లిన
సాహితీ ఋషి

నలభైఏళ్ళ సుదీర్ఘ ప్రస్థానంలో
తన వారసత్వానికి
ఓ ప్రభాత గీతికను బహూకరించి
'శివ'సుందరంగా తీర్చిదిద్ది
సత్యాల్ని ఆవిష్కరించిన
అక్షర సంపన్నుడు

'లాయర్'గా నెల్లూరుకు
అదృష్టరేఖను గీసిన
నిత్యస్మరణీయుడు
మనందరి రాజగోపాలుడు!



- చిన్ని నారాయణరావు
9440202942






# ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేస్తాం

- ఆర్డీఓ చైత్ర వర్షిణి



నవరత్నాలలో భాగంగా అర్హులైన పేద ప్రజలకు సొంత ఇంటి వసతి కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆదేశాలతో ఆత్మకూరు నియోజకవర్గ కేంద్రంలో ఇటీవల ఇళ్ల శంకుస్థాపనకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో చైత్రవర్షిణి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, హౌసింగ్ బోర్డ్ డి.ఇ మోహన్, ఆత్మకూరు సిండికేట్ ఫార్మసీ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ సర్దార్, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, వైసిపి నాయకులు, గృహాల లబ్ధిదారులు పాల్గొన్నారు. లబ్ధిదారుల చేత వారి స్థలాలకు నూతన ఇంటి నిర్మాణం కొరకు శంకుస్థాపన చేయించారు. త్వరగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి లబ్ధిదారు లకు అందజేస్తామని ఈ సందర్భంగా ఆర్డీవో చైత్ర వర్షిణి తెలిపారు

# స్మశానానికి స్థలం కావాలంటూ ప్రదర్శన




అధికారులకు ఎన్నిసార్లు చెప్పుకున్నా తమ సమస్య పట్టించుకోకపోవడంతో ఆ గ్రామానికి చెందిన కొందరు వినూత్న తరహాలో తమ నిరసన తెలిపారు. నెల్లూరు జిల్లా సంగం మండల కేంద్రమైన సంగం గ్రామంలో స్మశాన స్థలం కోసం రెండు ఎకరాలు కేటాయించాలని కోరుతూ సంగం బస్‌స్టాండ్ సెంటర్‌లో జననీ సేవా సంస్థ సభ్యులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి బిక్షాటన చేశారు. స్మశాన స్థలం కేటాయించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేప ట్టారు. సంగం తహసీల్దార్ నిర్మలానంద బాబాకు వినతిపత్రం అందజేశారు. త్వరితగతిన స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. సమస్య పరిష్కరించని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జననీ సేవా సంస్థ సభ్యులు మాఘం గిరి, శ్రీను, ప్రసాద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


కాగా, సంగం మండల తాసిల్దార్ నిర్మలానంద బాబా వెంటనే స్మశాన వాటిక స్థల ఆక్రమణలను పరిశీలించమని అధికారులకు తెలిపి పరిష్కారానికి తాను కూడా రంగంలోకి దిగారు.

# వేదగిరీశునికి 10 లక్షలకుపైగా హుండీ రాబడి

ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెల్లూరు రూరల్ మండలంలోని వేదగిరి కొండపై కొలువై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామికి భక్తులు సమర్పించుకున్న హుండీ కానుకల ద్వారా 10,38,320 రూపాయల దాకా రాబడి వచ్చింది. ఈనెల 8న ఆలయంలో హుండీలను లెక్కించగా ఈ మొత్తం వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఆలయ ఛైర్మెన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఈ లెక్కింపును పర్యవేక్షించారు.

# అల్లూరు పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

కరోనా మహమ్మారి వ్యాధి నుంచి ప్రజలను కాపాడాలని కోరుకుంటూ అల్లూరు గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి విశేష అలంకరణ చేసి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు మొక్కుకున్నారు. ఈనెల 8న జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో ఏఎంసి ఛైర్మెన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు మేడా కృష్ణారెడ్డి, సామంతుల సురేష్‌రెడ్డి, బీద రమేష్‌లతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



## చెన్నై జంట.. పెండ్లి కానుక

# మూగజీవాలకు భోగభాగ్యాలు



### ➤ అందరి ప్రశంసలందుకుంటున్న విలక్షణమైన వితరణ

**మానవతా హృదయంతో ఎందరో దాతలు సమాజంలో అనేకరకాలుగా సేవలు చేస్తుండడం సహజం. కానీ చెన్నైకి చెందిన ఓ కొత్తజంట పశుపక్ష్యాదులకు, మూగజీవాలకు కూడా మంచి పుష్టికరమైన..వాటికి అత్యంత ప్రీతికరమైన ఆహారంతో కడుపు నింపడానికి ముందుకురావడం ఎంతైనా అరుదే. అందుకే ఆ విలక్షణమైన వితరణ అందరి ప్రశంసలు అందుకుంటోంది. వందలాది మూగజీవాలు, పశుపక్ష్యాలకు ఆహారం సమకూర్చిన ఆ కొత్తజంట నిఖిల్-రక్షలను ప్రజలు, దాతలు కూడా అభినందిస్తూ వారిద్దరూ కలకాలం చల్లగా..హాయిగా ఉండాలని మనసారా ఆశీర్వదిస్తున్నారు.**









ఎందరికో డబ్బుంటుంది. కానీ ఆ డబ్బును నిరుపేదల ఆకలిని తీర్చడానికి వెచ్చించే సుగుణం మాత్రం కొందరికే ఉంటుంది. అందులోనూ పశుపక్ష్యాదుల, మూగజీవాల ఆకలిని కూడా తీర్చి వాటికి తమవంతు సేవచేయాలనే దయాగుణం ఎంతో అరుదుగా ఉంటుంది. అలాంటి అరుదైన దాతల్లో చెన్నైకి చెందిన కొత్త దంపతులు నిఖిల్-రక్ష అందరికీ ఆదర్శమనే చెప్పవచ్చు. వీరిరువురి పెళ్ళివేడుకలు గతనెలలో జరిగాయి. కోవిడ్ నేపథ్యంలో పెళ్ళి నిరాడంబరంగానే జరిగింది. పెళ్ళి ఖర్చులో కొంత మిగిల్చి 45వేల రూపాయలను మూగజీవాలకు ఆహారం అందించేందుకు వెచ్చించాలనుకున్నారు. కానీ అన్ని పశుపక్ష్యాదులు ఒక్కచోటే ఎక్కడ దొరుకుతాయని అనుకుంటుంటే వారి బంధువుల ద్వారా నెల్లూరులోని కల్లూరుపల్లిలో ఇందిరా జైన్, ఉమాదేవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ మహావీర్ జైన్ పశుసేవా కేంద్రం ఉందని, అక్కడ ఎన్నో రకాల పక్షులు, పశువులను వందల సంఖ్యలో సంరక్షిస్తుంటారని తెలుసుకుని, ఆ కేంద్రానికి ఆ డబ్బును వితరణగా అందజేశారు. ఆ డబ్బుతో కేంద్రం నిర్వాహకులు మూగజీవాలకు ప్రీతికరమైన ఆహారాన్ని సమకూర్చారు.

### పండ్లు ఫలహారాలతో పసందుగా మూగజీవాలకు పెండ్లిభోజనం

మూగజీవాలే కదా అని ఏదో గడ్డీ గాదం కాకుండా ఆ కేంద్రంలో ఉన్న వందలాది గోమాతలు, గేదెలు, కోతులు, చూడముచ్చటగా ఉన్న రకరకాల కుందేళ్ళు, వేలాదిగా ఉన్న కుక్కలు, కుక్కపిల్లలతో పాటు వందల సంఖ్యలో పావురాలు, రకరకాల పక్షులన్నిటికీ.. వాటికి ఎంతో ఇష్టమైన ఆహారాన్ని ఎంపికచేసి..పెళ్ళిభోజనం అన్నట్లుగానే పెట్టారు. అరటి, యాపిల్, పుచ్చ తదితర అనేక రకాల పండ్లతో పాటు, ఆకులు, కాయగూరలు, ప్లేట్లలో రకరకాల పండ్లముక్కలు కూడా పెట్టి వాటికి తృప్తిగా కడుపు నింపారు. పక్షులకు రకరకాల గింజలు పెట్టారు. అవి ఎంతో ఇష్టంగా వాటిని తింటుంటే వాటిని చూసిన వారంతా ఎంతో ఆనందించారు. అప్పుడప్పుడూ ఇలా కొంతమంది దాతలు పశుసేవా కేంద్రంలోని మూగజీవాలకు ఆహారం సమకూర్చేందుకు సాయం అందిస్తుంటారంటూ వారి సేవాభావాన్ని ఆ కేంద్రం నిర్వాహకురాలు ఇందిరాజైన్ ఈ సందర్భంగా కొనియాడారు. వివాహ వేడుకల సందర్భంగా చెన్నైకి చెందిన కొత్తజంట ఇలా మూగజీవాలకు ఆహారం అందించడం ఎంతో సంతోషకరమన్నారు. దాతలు మరింతమంది సహృదయంతో ముందుకు వచ్చి తగు సాయం చేస్తే ఇక్కడి మూగజీవాలకు పుష్టికరమైన..తృప్తికరమైన ఆహారాన్ని అందించడానికి సాయం చేసినట్లవుతుందని ఆమె కోరారు. పశుపక్ష్యాదులకు కూడా తమవంతు సేవచేయాలనుకునే మనసున్న దాతలకు ఇంతకంటే మంచి సేవాకార్యక్రమం మరెక్కడుంటుందీ?.. సకల జీవరాశుల్లోనూ ఉండేది ఆ సర్వేశ్వరుడే.. పశుపక్ష్యాదులకు సేవచేస్తే సాక్షాత్తూ ఆ భగవంతునికి సేవ చేసినట్లే. అందులోనూ నెల్లూరులోని శ్రీ మహావీర్ జైన్ పశుసేవా కేంద్రం వారు అంకితభావంతో మూగజీవాలకు, పశుపక్ష్యాదులకు చేస్తున్న సేవలు అనన్య సామాన్యం.. అనితరసాధ్యమనే చెప్పాలి. అలాంటి కేంద్రాలకు దాతలు సాయం చేసి పశుపక్ష్యాదుల కడుపు నింపగలిగితే..అంతకన్నా పుణ్యం ఏముంటుందీ!..




కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక

ప్రతి అక్షరం ఒక అస్త్రం
ప్రతి వాక్యం ఒక శస్త్రం
ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం

లాయర్
వారపత్రికకు
40వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

40 లాయర్ YEARS



ప్రొ॥ సి.యం.కె.రెడ్డి
అధ్యక్షులు
అఖిల భారత తెలుగు సమాఖ్య
తమిళనాడు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్
కనకదుర్గ తెలుగు స్కూల్స్
చెన్నై.

# మానవరూపంలో పుట్టి.. దేవతగా అవతరించిన నర్రవాడ శ్రీ వెంగమాంబాదేవి





మానవరూపంలో పుట్టి దేవతగా వెలసి..ప్రజల బాధలు తీరుస్తూ..భక్తుల కోర్కెలు నెరవేరుస్తూ అందరి పూజలందుకుంటున్న చల్లనితల్లి.. మహామహిమాన్విత మూర్తి.. శ్రీ వెంగమాంబాదేవి పేరంటాలు అమ్మవారు. నెల్లూరుజిల్లాలోని ప్రసిద్ధమైన ఆలయాల్లో శ్రీ వెంగమాంబా దేవి ఆలయం ఒకటి. చరిత్రాత్మకమైన ఈ ఆలయం దుత్తలూరు మండలంలోని నర్రవాడలో ఉంది. మనుషులంతా ఒకటేనని, అంటరానితనం వద్దని చాటిచెప్తూ అందరినీ సమానంగా చూసుకోవాలని ప్రబోధించిన మానవీయమూర్తి శ్రీ వెంగమాంబాదేవి అమ్మవారు. అమ్మవారి కృప ఉంటే చాలు ఎంతటి కష్టాలైనా తీరిపోతాయి. సుమారు నాలుగువందల ఏళ్ళ క్రితం శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి ఈ ఆలయం ఎంతో చరిత్రాత్మకమైనదిగా.. భక్తులపాలిట కొంగుబంగారంగా ప్రసిద్ధి.

## మన దేవాలయాలు (51)

పవిత్రమైన ధర్మాచరణతో, ఆదర్శ జీవన విధానంతో పతిభక్తికి ప్రతీకగా నిలిచిన శ్రీ వెంగమాంబాదేవి అమ్మవారి దివ్యచరిత్ర అద్భుతం. అమ్మవారి మహిమలు అనంతం. పతిదేవుని కంటే ముందుగానే అగ్నిప్రవేశం చేసి.. దేవతగా వెలసి.. అశేష భక్తకోటి పూజలందుకుంటున్న విశేష చరిత్ర.. నర్రవాడ శ్రీ వెంగమాంబ అమ్మవారిది. కరుణామయిగా, సంతాన ప్రదాయినిగా అమ్మవారు ఎంతో ప్రసిద్ధి. అమ్మవారి చరిత్ర, ఆలయ ఆవిర్భావం గురించి వినిపిస్తున్న పలు కథనాలు.. ఆసక్తికరమైన విశేషాలిలా ఉన్నాయి.

### అమ్మవారి చరిత్ర :

నర్రవాడ వద్ద వడ్డిపాళెం అనే కుగ్రామం అమ్మవారి జన్మస్థలం. పుణ్యదంపతులైన పచ్చవ వెంగమనాయుడు, సాయమ్మల పూర్వజన్మ సుకృతంగా శ్రీ రేణుకాదేవి అనుగ్రహంతో వెంగమాంబాదేవి జన్మించింది. చిన్నతనం నుంచే ఆమెకు దైవచింతన కలిగి, ఆత్మజ్ఞానంతో సాటి బాలలకు భక్తిని ప్రబోధించడం చూసి ఆమెలో ఏదో దివ్య శక్తి ఉందని ప్రజలు భావిస్తుండేవారు. ఆ తర్వాత కొంతకాలానికి వెంగమాంబాదేవికి వేమూరు గురవయ్యతో వివాహమైంది. వీరిరువురు అన్యోన్యంగా జీవిస్తుండేవారు. ఈ నేపథ్యంలో ఒకసారి గ్రామంలో వర్షాలు లేక బాగా నీటిఎద్దడి ఏర్పడడంతో ఆ ఊరి ప్రజలు నర్రవాడలోని బావిలో నీరు చేదుకుని తెచ్చేవారు. ఆ కాలంలో అప్పట్లో దళితులను బావి వద్దకు రానిచ్చేవారు కాదు. దళితులు దాహంతో బావికి దూరంగా నిల్చుని ఎవరైనా నీళ్ళు పోస్తారేమోననే ఆశతో ఎదురుచూస్తుండేవారు. వారి దీనస్థితిని చూసిన వెంగమాంబాదేవి వాళ్ళకి నీళ్ళు పోసి, నీళ్ళకి కరువు లేకుండా అందరూ సుభిక్షంగా ఉండాలంటూ ఆమె దైవాన్ని ప్రార్థించడంతో కుండపోతగా వర్షాలు కురిసేవి. దీంతో దళితులు ఎంతగానో సంతోషపడి పసుపుచీరను కానుకగా ఇచ్చి కృతజ్ఞతలు చెప్పుకుంటారు. ఇదిలావుండగా, ఒకనాడు వెంగమాంబ భర్త గురవయ్య పశువులను మేపుకునేందుకు అడవికి వెళ్ళి ఉండగా, వెంగమాంబాదేవి తన స్నేహితురాళ్ళతో అడవిలో గడ్డి కోసుకునేందుకు వెళ్ళడం జరిగింది. ఆ సమయంలో కొందరు దొంగలు వీరిని అటకాయించడంతో స్నేహితురాళ్ళంతా పెద్దపెట్టున కేకలు వేయడం, గురవయ్య పరుగుపరుగున వచ్చి వారిని అడ్డుకోగా ఆ పోరాటంలో ఒక దొంగ ఈటెతో పొడవడంతో గురవయ్యకు గుండెల్లో తీవ్రగాయమై స్పృహ కోల్పోయాడు.

### అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం

గురవయ్యను ఇంటికి తీసుకువచ్చి ఎంతగా చికిత్సలు చేసినా స్పృహలోకి రాకపోవడంతో ఇక తనభర్త బతకడని భావించి, తన పతికి మృత్యువు సమీపించకముందే తాను ముత్తైదువుగానే తనువు చాలించాలని అగ్నిప్రవేశానికి అత్తమామలు, తల్లిదండ్రుల అనుమతిని తీసుకుంటుంది వెంగమాంబాదేవి. పూజామందిరంలో దైవప్రార్థన చేసుకుని, దళితులు ఇచ్చిన పసుపుచీరను ధరించి త్రిశూలాన్ని, గంధపు గిన్నెను చేతపట్టుకుని నర్రవాడ గ్రామంలోని చెరువుకట్ట వద్ద ఉన్న ప్రదేశంలో ఏర్పాటుచేసిన అగ్నిగుండంలో దిగబోతుండగా, ఆమె స్నేహితురాలు పెద్దగా ఏడుస్తూవచ్చి వెంగమాంబను కౌగలించుకుంటుంది. వెంగమాంబ ఆమెను ఓదారుస్తూ అగ్నిగుండ ప్రవేశం అనంతరం తాను దేవతగా వెలుస్తానని, నువ్వూ-నీ భర్త కూడా నా సాన్నిధ్యంలో దేవతలై అందరి పూజలందుకుంటారని చెప్పి అగ్నిగుండంలో దూకుతుండగా వెంగమాంబ అగ్నిగుండ ప్రవేశం ఇష్టం లేని వెంగమాంబ బావ.. అంధుడైన ముసలయ్య కూడా దు:ఖిస్తూ వచ్చి వారించబోతూ ఆమెను అడ్డుకునేందుకు చేయిచాచగా ఆమె పైటకొంగు ఆయన చేతికందుతుంది. అందుకామె కోపగించినా మళ్ళీ శాంతించి 'నువ్వు మరణానంతరం నా సన్నిధిలో చేరి భక్తుల పూజలందుకుంటావని' అనుగ్రహిస్తుంది. అనేక గ్రామాల ప్రజలంతా జయజయధ్వానాలు చేస్తుండగా వెంగమాంబాదేవి అగ్నిప్రవేశం చేస్తుంది. ఆ తర్వాత కొద్దిసేపటికే గురవయ్య కూడా మరణిస్తాడు.


### అత్యద్భుతమైన రీతిలో ఆలయ నిర్మాణం


మరునాడు రాత్రి వెంగమాంబాదేవి తన స్నేహితురాలికి, అంధుడైన తన బావకు స్వప్నంలో కనిపించి తన మహిమను వ్యక్తం చేయగా, గ్రామప్రజలకు ఆ విషయం తెలియజేయడంతో అందరూ అగ్నిగుండం వద్దకు వచ్చి చూస్తే ఆమె మంగళసూత్రం, బావ పట్టుకున్న పైట కొంగులోని పిడికిలి వస్త్రం మాత్రం అగ్నికి ఆహుతి కాకుండా అలాగే ఉండడం చూసి ఆశ్చర్యపోతారు. దీంతో ప్రజలకు శ్రీ వెంగమాంబాదేవి దివ్యశక్తి గోచరమై ఎనలేని భక్తిభావంతో అత్యద్భుతంగా ఆలయం నిర్మించడం జరిగింది.

ఆ ఆలయంలో శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి శిలారూపంతో పాటు, ఆమె భర్త గురవయ్య వీరుడు, మరో గుడిలో ఆమె స్నేహితురాలు పెదవెంగమ్మ, ఆమె భర్త నారయ్య వీరుడుతో పాటు, పడమరభాగంలోని గుడిలో ముసలయ్య వీరుడు ఆనాటినుంచి భక్తుల పూజలందుకుంటూనే ఉన్నారు. ఇలా ఎంతోకాలంగా శ్రీ వెంగమాంబాదేవి అమ్మవారు అందరి ఆరాధ్య దేవతగా.. ఇలవేలుపుగా పూజలందుకుంటోంది. సంతానం లేనివారికి సంతానప్రాప్తి కలిగించే చల్లనితల్లిగా అమ్మవారు ఎంతో ప్రసిద్ధి. మరో విశేషం ఏమిటంటే, అమ్మవారి ఆలయం నుంచి కొంత ధనాన్ని రుణంగా తీసుకుంటే అమ్మవారి దయతో వ్యాపారాలు బాగా కలిసొస్తాయని భక్తులు గట్టిగా చెప్తుంటారు. ఆ తర్వాత వారు ఆ రుణాన్ని వడ్డీతో సహా అమ్మవారికి సమర్పించుకుంటుంటారు కూడా. 1940లో భక్తులు, దాతలు ఈ ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేశారు.

### అంగరంగ వైభవంగా అమ్మవారి బ్రహ్మోత్సవాలు

జ్యేష్ఠ మాసంలో పౌర్ణమి గడిచిన మొదటి ఆదివారం నుంచి వెంగమాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఆలయ ధర్మకర్తల కమిటీ నేతృత్వంలో అయిదురోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. తొలిరోజున 'నిలుపు' వేడుక, రెండు-మూడు రోజుల్లో రథంలో అమ్మవారి గ్రామోత్సవాలు, మూడవ రోజున కళ్యాణోత్సవం, అయిదవ రోజున అమ్మవారికి పెద్దఎత్తున పొంగళ్ళు నివేదించి పూజలు చేయడం జరుగుతాయి. ఈ సందర్భంగా విశేషమైన అలంకారాలు, విశిష్టమైన పూజలతో అమ్మవారిని సేవిస్తారు. బ్రహ్మోత్సవాల రోజుల్లో అమ్మవారి వైభవాన్ని చూడడానికి రెండుకళ్ళూ చాలవు. ఆ రోజుల్లో ఆలయంతో పాటు నర్రవాడ గ్రామమంతా భక్తజనసందోహంతో క్రిక్కిరిసిపోతుంది.





## కరోనా నివారణార్థం..
# రంగనాధుని ఆలయంలో హోమాలు

ప్రపంచవ్యాప్తంగా ప్రజలను పట్టి పీడిస్తున్న కరోనా మహమ్మారి వ్యాధిని అంతం చేయాలని ప్రార్థిస్తూ, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈనెల 9న నెల్లూరులోని ప్రసిద్ధపుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాయక స్వామి దేవాలయంలో పెద్దఎత్తున హోమాలు జరిగాయి. లోకకల్యాణం కోసం, కరోనా నివారణార్థం ఆలయ ప్రధాన అర్చకుడు జగన్నాధాచార్యులు, అర్చకులు సుదర్శనాచార్యులు, పి.వి నరసింహాచార్యుల నేతృత్వంలో భక్తిశ్రద్ధలతో హోమాలు నిర్వహించారు. వేదమంత్రోచ్చటనలతో మహా శాంతి హోమం, లక్ష్మీనారాయణ, నరసింహ హోమాలు, శ్రీ సుదర్శన హోమం, గరుడ, హనుమ హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు, అమ్మవార్లకు ప్రత్యేకపూజలు చేశారు. ఈ యాగ కార్యక్రమాలు, పూజా కార్యక్రమాలన్నీ కోవిడ్ నిబంధనలను అనుసరించి ఆలయ అర్చకులు స్వామివార్లకు ఏకాంతంగా పూజలు సేవలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

# ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ల వితరణ

కరోనా బాధితులకు అత్యవసరమైన రెండు ఆక్సిజన్ సిలిండర్లను నెల్లూరులోని జైగజని ఎలక్ట్రికల్స్‌కు చెందిన రాజశేఖర్, హరీష్‌లు వితరణగా ఇచ్చి తమ సేవాభావం చాటుకున్నారు. వీటిని ఈనెల 8న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ హరేందిరప్రసాద్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

# చిరు వ్యాపారుల జీవితాలకు..'జగనన్న తోడు'

- వడ్డీ లేకుండా 10వేల రుణసాయం అందించిన సిఎం
- రాష్ట్రవ్యాప్తంగా లబ్దిదారులకు 370 కోట్లు

**ఈ కరోనా కష్టకాలంలో వీధుల్లో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వాళ్ళకు చేదోడుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కొక్కరికి 10 వేల రూపాయల వంతున వడ్డీ లేని రుణం అందించి వారందరి అభిమానానికి పాత్రులయ్యారు. రాష్ట్రంలో రెండో విడత సాయంగా ఈ ఆర్థిక సాయాన్ని వ్యాపారుల ఖాతాల్లో జమ చేసి చిరు వ్యాపారులకు అండగా ఒక అన్నగా నేనున్నానంటూ భరోసా కల్పించారు.**

తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లాలో ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చిరు వ్యాపారులు 3 లక్షలా 70వేల మందికి రెండో విడతగా 370 కోట్ల వడ్డీ లేని రుణాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి వారి ఖాతాలకు జమ చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికి 'జగనన్న తోడు' అందేలా చర్యలు తీసుకుంటున్నామని, నాడు పాదయాత్రలో వారి కష్టాలు చూశామని, నేడు వారందరికీ తోడుగా నిలుస్తున్నానని అన్నారు. చిన్నచిన్న వ్యాపారులకు తక్కువ వడ్డీకి కానీ, వడ్డీ లేని రుణాలు కానీ దొరుకుతాయా అంటే ఎక్కడా ఆ పరిస్థితి లేదని, గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యక్తుల వద్ద వారు అధికవడ్డీలకు అప్పులు చేస్తున్నారని, ఆ పరిస్థితిని మార్చేందుకే ఈ పథకం ప్రవేశపెట్టామని జగన్ చెప్పారు.




జిల్లాలో జగనన్న తోడు లబ్దిదారుల చెక్కును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

## జిల్లాలో లబ్దిదారులకు 23.68 కోట్లు

నెల్లూరుజిల్లాలోనూ ఈ పథకం కింద 23,681 మంది లబ్దిదారులకు ఈనెల 8న 23.68 కోట్ల రూపాయలను వడ్డీ లేని రుణంగా అందజేస్తూ, ఆ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు నమూనా చెక్కును విడుదల చేసి మాట్లాడుతూ కోవిడ్ నేపథ్యంలో వ్యాపారాలు దెబ్బతిన్నవారికి ఈ రుణం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యంగా కూరగాయల మార్కెట్‌లోని చిరు వ్యాపారులకు దీనివల్ల మంచి ప్రయోజనం కలుగుతుందన్నారు.

## ప్రత్యేక టీకా కార్యక్రమానికి ఏర్పాట్లు

కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులు, చిరు వ్యాపారులకు, ఆటో డ్రైవర్లకు కోవిడ్ టీకా వేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు. అదేవిధంగా అయిదేళ్ళ లోపు చిన్నారుల తల్లులకు కూడా టీకా వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీలు గణేష్‌కుమార్, బాపిరెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




జననం
23.08.1934

మరణం
02.06.2021

# శ్రద్ధాంజలి

మా ఇంటి కీర్తి, అనురాగమూర్తి,
మంచితనం, మానవత్వం మూర్తీభవించిన ఆత్మీయదీప్తి,
**శ్రీ కాకుటూరు చంద్రశేఖరరెడ్డి గారి**
పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

భార్య : **కాకుటూరు సుగుణమ్మ**

కుమారుడు - కోడలు
**కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి - మాధవి**


మనుమడు - మనుమరాలు
**కాకుటూరు అభినయ్‌రెడ్డి - తన్మయి**

కుమార్తె - అల్లుడు
**చిట్టమూరు శైలజ - ప్రవీణ్‌కుమార్‌రెడ్డి**

మనుమరాలు - మనుమడు
**పుట్టంరెడ్డి శ్రీమనస్విని - గౌతమ్‌రెడ్డి**

మునిమనుమలు - మునిమనుమరాలు
**సహర్ష్, అయాన్ - అంజలి**

**ఉత్తరక్రియలు :**
తేది.12.06.2021 శనివారం మినగల్లులోని
వారి స్వగృహము నందు జరుగును.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com